నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
ఆదివారం | 24 మార్చి 2024 | www.navatelangana.com

## రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మెన్‌గా ఎలుక దేవయ్య..



నవతెలంగాణ-బెజ్జంకి

మాలమహానాడు నూతన రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మెన్‌గా ఎలుక దేవయ్య నియామకం అయ్యారు. హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్‌లో శనివారం నిర్వహించిన జాతీయ మాల మహానాడు రాష్ట్ర విస్తతస్థాయి సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్, రాష్ట్రాధ్యక్షుడు పిల్లి సుధాకర్‌లు దేవయ్యకు నియామకం పత్రం అందజేశారు. కాగా తన నియమాకానికి సహకరించిన మాలమహానాడు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు దేవయ్య కతజ్ఞతలు తెలిపారు.

## సాంకేతిక విధానంతో యువతకు ఉపాధి..



నవతెలంగాణ-బెజ్జంకి

వ్యవసాయ రంగంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన యంత్రాలు యువతకు ఉపాధి కల్పిస్తున్నాయని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్ కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న క్రమంలో మండల పరిధిలోని బెజ్జంకి క్రాసింగ్ గ్రామ శివారులో యువకులు డ్రోన్ యంత్రం ద్వారా పురుగుల మందు పిచికారీ చేయడాన్ని బోయినిపల్లి వినోద్ కుమార్ గమనించి యువకులతో మాట్లాడారు. యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని వ్యాపార రంగాల్లో స్థిరపడాలని యువతకు సూచించారు.



## అగ్నిప్రమాద భాధితునికి ఆర్థిక సాయం అందించాలి

నవతెలంగాణ-సిద్దిపేట

భూంపల్లీ ఎక్స్‌రోడ్‌లో గల ఓ చెప్పుల దుకాణంలో గత దీపావళి రోజున అగ్నిప్రమాదం జరిగిందని.. ఆ భాధితుడికి ఆర్థిక సాయం అందిం చేవిధంగా చూడాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరిని కోరినట్టు సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు, న్యాయవాది బైరి ప్రవీణ్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. భుంపల్లిలో వ్యాపారం చేసుకుంటూ, సిద్దిపే టలో ఉంటున్న దడికే యాదగిరికి సంభందించిన చెప్పుల దుకాణం గత దీపావళి రోజున అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైందన్నారు. అతడికి ఎలాంటి ఉపాధి లేదని, తనకి ప్రభుత్వం నుండి ఆర్థిక సాయం చేయాలని కోరగా.. కలెక్టర్ వెంట నే స్పందించి ఎస్సీ కార్పొరేషన్ అధికారులకు ఈ విషయాన్ని పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు.

## సీఎంను విమర్శిస్తే ఊరుకునేది లేదు..



నవతెలంగాణ-దుబ్బాక

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి లేదని కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్ మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డిని విమర్శిస్తే ఊరుకునేది లేదని, పల్లా ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. చెరుకు శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలోని అన్ని వ్యవస్థల్ని నాశనం చేసిందని ధ్వజమెత్తారు. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2019 తర్వాత బీఆర్ఎస్ బీ-ఫామ్ మీద గెలిచిన ఎమ్మెల్యేలు,అధికారం కోల్పోయిన 2023 వరకు మీ పార్టీలో ఎంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారో లెక్క చెప్పాలన్నారు. ఇతర పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలను భయభ్రాంతులకు గురిచేసి బీఆర్ఎస్‌లోకి లాక్కున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ సర్కార్ తెలంగాణను పునర్ నిర్మిస్తుందని, తమ సర్కారు అందిస్తున్న ప్రజా పాలనను చూసే కాంగ్రెస్ లోకి చేరికలవుతున్నారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో దుబ్బాక పీఏసీఎస్ వైస్ చైర్మెన్ కాల్వ నరేష్,కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఉశయ్యగారి రాజిరెడ్డి,సీనియర్ నాయకులు అమ్మన కళాధర్ రెడ్డి,బాలకిషన్,సత్తు శ్రీనివాస్ రెడ్డి, కర్ణంపల్లి రమేష్ గౌడ్,మల్లుగారి రామచంద్ర రెడ్డి,స్వామి,నస్కంటి నర్సింలు, పలువురు పాల్గొన్నారు.

## స్వార్థ రాజకీయాలు కేరాఫ్ ప్రతాప్ రెడ్డి..



నవతెలంగాణ-మర్కుక్

స్వార్థ రాజకీయాలు కేరాఫ్ అడ్రస్ వంటేరు ప్రతాప్ రెడ్డి అని మర్కుక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లా డుతూ.. ఊసరవెళ్లిలాగే రంగు మార్చే ప్రతాప్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దన్నారు. పూటకో పార్టీ మారే ప్రతాప్‌రెడ్డిని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. కష్ట కాల ంలో కాంగ్రెస్ పార్టీని కాపాడిన నాయకులను పార్టీ కాపాడుకోవాలన్నారు. మెదక్ పార్లమెంటులో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయమన్నారు.

## భగత్‌సింగ్ స్ఫూర్తితో బీజేపీని ఓడిద్దాం



నవతెలంగాణ-దుబ్బాక

మతతత్వ, సామ్రాజ్యవాద, కార్పొరేట్ వ్యవస్థల కబంధహస్తాల నుంచి భారతదేశాన్ని కాపాడాలన్న సంకల్పంతో 90 ఏండ్ల క్రితమే భగత్ సింగ్,రాజ్ గురు,సుఖదేవ్‌లు బ్రిటీష్ సర్కార్‌తో వీరోచిత పోరాటం చేశారని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీ.భాస్కర్ అన్నారు. వారి పోరాట స్ఫూర్తితో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ, సామ్రాజ్యవాద, కార్పొరేట్ వ్యవస్థలకు కొమ్ముకాస్తున్న బీజేపీ సర్కార్ ను ఓడిద్దామని, ఆ మహనీయులకు మనమిచ్చే నిజమైన నివాళి ఇదేనని స్పష్టం చేశారు. దేశ స్వాతంత్రం కోసం యుక్త వయసులోనే ఉరికొయ్యలను ముద్దాడి తణప్రాయంగా తమ ప్రాణాల్ని వదిలిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 93వ వర్ధంతి సందర్భంగా శనివారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని సీఐటీయూ ప్రజాసంఘ కార్యాలయంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆ మహనీయులను స్మరించుకున్నారు. నేటి యువత భగత్ సింగ్,రాజ్ గురు,సుఖ్ దేవ్ ల పోరాట స్ఫూర్తితో ఈ దేశాన్ని మతతత్వ, సామ్రాజ్యవాద,కార్పొరేట్ వ్యవస్థలకు కొమ్ముకాస్తున్న బీజేపీ సర్కార్ నుంచి రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) నాయకులు ఎండీ.సాదిక్, కొంపల్లి భాస్కర్, రాజు, లక్ష్మీనరసయ్య, రవి, స్వామి పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు అమలు తప్పకుండా చేస్తాం



నవతెలంగాణ-మర్కుక్

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు తప్పకుండా అమలు చేసి తీరుతామని దామరకుంట కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షులు పత్తి నర్సింలు యాదవ్ అన్నారు. శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహజ్యోతి, ఉచిత గ్యాస్ అమలు కాని వారు ఆందోళన పడోద్దన్నారు. సాకేంతిక లోపంతో కొందరివి కాలేదని.. వారు ఎలాంటి అపోహలు పడొద్దన్నారు. వారు మండల ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరి వర్తిస్తాయన్నారు. కాంగ్రెస్ సేవాదళ్ మండలాధ్యక్షులు అంజనేయులు యాదవ్,నాయకులు పత్తి శంకర్, శ్యామ్, పత్తి అంజనేయులు, ఆనంద్ ఇలాని సాధ తదితరులున్నారు.

## బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం



నవతెలంగాణ-కొమురవెల్లి

స్థానిక బీజేపీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు బూర్గోజు నాగరాజు అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనగామ అసెంబ్లీ కో కన్వీనర్ దండ్యాల లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ గెలుపునకు కృషి చేయాలన్నారు. పార్టీ అనుబంధ, మండల కమిటీలను నియమించారు. మండల ఉపాధ్యక్షులుగా బ్రాహ్మణపల్లి బాబు, ఈగ కనకయ్య, జనగామ తిరుపతి, కార్యదర్శులుగా అక్కెనపల్లి సంపత్ రెడ్డి, తలారి నాగరాజు మండల ఓబీసీ మోర్చా మండల అధ్యక్షునిగా మెరుగు హరికృష్ణ, దళిత మోర్చా మండల అధ్యక్షునిగా బచ్చల రాజు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షునిగా జోగ్రిగల శరమందారెడ్డి,ఎస్టీ మోర్చా మండల అధ్యక్షునిగా శివరాత్రి నరేందర్, లీగల్ సెల్ మండల కన్వీనర్ గా శరత్ బాబు, కో కన్వీనర్ ఐలి గణేష్, సోషల్ మీడియా మండల కన్వీనర్ గా పుట్ట కనకయ్యలను నియమించారు. ఈ కార్యక్రమంలో కుడి మల్లేశం దండ్యాల బిక్షపతి రెడ్డి, ఘనబోయిన శ్రీనివాస్ గౌడ్ ప్రధాన కార్యదర్శులు కొయ్యడ మల్లేశం గౌడ్, దేవి మధు, మండల ఉపాధ్యక్షులు మద్దికుంటకరుణాకర్, వంగశివారెడ్డి యువ మోర్చా మండల అధ్యక్షులు సనాది కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నేర్చుకోవడమనేది నిరంతర ప్రక్రియ

- గీతం అధ్యాపక వికాస కార్యక్రమ ప్రారంభోత్సవంలో వక్తలు

నవతెలంగాణ-పటాన్‌చెరు

నేర్చుకోవడమనేది నిరంతర ప్రక్రియ అని, బోధన నైపుణ్యాలను పెంపొందించడానికి, విద్యా నాణ్యత మెరుగుపరచడానికి అధ్యాపకులకు నిరంతర శిక్షణ అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో 'శిక్షకులకు శిక్షణ' పేరిట శనివారం ఒక రోజు అధ్యాసక వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యాపకులను వర్తమాన అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడానికి, వారి నై పుణ్యాలు, జ్ఞానాన్ని పెంపొం దించడం లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆర్ఎక్స్ సెల్లా వ్యవస్థాపకుడు, డైరెక్టర్ గతంలో డాక్టర్ రెడ్డీస్ లో శిక్షకుడిగా పనిచేసిన బెదద్యుతి చక్రవర్తి ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఈఎఫ్‌పీలో పాల్గొన్న వారికి ప్రాజె క్ట్-ఆధారిత అభ్యాసం, పరిశోధన- సమగ్ర బోధన, విద్యార్థి-కేంద్రీకృత అభ్యాసాలను చక్రవర్తి పరిచయం చేశారు. సాంకేతికత - ఆధారిత అభ్యాస పద్ధతులను నేర్చుకోవడంలో సహాయ పడటానికి, విద్యార్థుల పురోగతి, అభ్యాసానికి సంబంధించిన నిర్మాణాత్మక, సంగ్రహణ అంచనాలను అభివృద్ధి చేయడానికి ఈ శిక్షణ సహాయపడుతుందన్నారు. తొలుత, ఈ కార్యక్రమాన్ని జీఎస్పీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ ప్రారంభించి, అతిథిని జ్ఞాపికతో సత్కరించారు. ఆ తరువాత ఎఫ్ఎసీ వినూత్నంగా డిజిటల్ విధానంలో ప్రారంభించారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందు తున్న సాంకేతికతలు, బోధన పద్ధతులు, మూల్యాంకన వ్యూహాలకు అనుగుణంగా పాఠ్యాంశాల బోధన ఉండాలని డాక్టర్ శివకుమార్ అభిప్రాయపడ్డారు. జంట నగరాల చుట్టుపక్కల ఉన్న పలు ఫార్మసీ కళాశాలల నుంచి దాదాపు 40 మందికి పెగ్రా అధ్యాపకులు ఈ అధ్యా పక వికాస కార్యక్ర మంలో పాల్గొన్నారు. వారందరికీ ముగి ంపు సదస్సులో ప్రశంసా పత్రాలను ప్రధానం చేశారు. జీఎస్ పీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జొప్పాదిత్య ఛటర్జీ ఈ కార్యక్రమాన్ని సమన్వయర, వందన సమర్పణ కూడా చేశారు.



**గీతంను సందర్శించిన సాయిమేధా ఇన్స్టిట్యూట్ విద్యార్థులు..**

హైదరాబాద్ కోఠిలోని సాయి మేధా ఇన్స్టిట్యూట్‌కు చెందిన దాదాపు 800 మంది డిప్లొమా విద్యార్థులు శనివారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శిచడంతో పాటు గీతం ప్రవేశ పరీక్షను కూడా రాశారు. ఈ విద్యార్థులందరితో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్‌ను ఆర్.శాస్త్రి ముఖాముఖి నిర్వహించారు. గీతమ్ లోని మౌలిక సదుపాయాలు, నిర్వహిస్తున్న కోర్సులు, ప్రయోగశాలలు, కెరీర్ గైడెన్స్ అవకాశాలు, వ్యవస్థాపకులుగా విద్యార్థులు ఎదగడానికి తోడ్పడే వెంచర్ డెవలప్మెంట్ కేంద్రం, విద్యార్థుల సంపూర్ణ పరిణితికి ఉపకరించే విద్యార్థి క్లబ్బు, హాస్టళ్ల వసతి, రవాణా సదుపాయాలు వంటి వివరాలను విద్యార్థులకు తెలిపారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. ఆ తరువాత గీతమ్ లోని వివిధ ఇంజనీరింగ్ విభాగాధిపతులు ఆయా విభాగాల వారీగా (ఈసీఈ, మెకానికల్, సివిల్, సీఎస్ఈ) విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. గీతమ్‌లోని వసతులను స్వయంగా వీక్షించేలా క్యాంపస్ టూర్‌ను ఏర్పాటు చేశారు.విజయవంతంగా ముగిసిన ఈ కార్యక్రమాన్ని గీతం అడ్మిషన్ల విభాగం సమన్వయం చేసింది.

## పరీక్ష రాసి.. కాడె పట్టిన విద్యార్థి



నవతెలంగాణ-గజ్వేల్

అన్నీ తానై చూసు కుంటున్న తాత మృతి చెందగా.. ఆ దు:ఖంతోనే పదో తరగతి పరీక్ష రాసిన ఓ విద్యార్థి.. పరీక్ష అనంతరం తాత పాడె పట్టాడు. ఈ విషాదకర ఘటన గజ్వేల్ మండలం హమ్మదీపూర్‌లో శనివారం జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన శనిగరి రామయ్య (80) శనివారం మృతి చెందాడు. అయితే అతని కుమారుడు శ్రీను ఏడాది క్రితమే మృతి చెందగా.. ఆయన కుమారుడు(మృతుని మనవడు) శ్రీకాంత్ బాధ్యతలను రామయ్యనే చూసుకుంటున్నాడు. కాగా శ్రీకాంత్ పదో తరగతి చదువుతుండగా ప్రస్తుతం బోర్డ్ ఎగ్జామ్స్ నడుస్తున్నాయి. ఈ క్రమంలో ఓ పక్క తాత మృతి చెందగా దు:ఖాన్ని దిగమింగుతూనే మరోపక్క పరీక్షకు శ్రీకాంత్ హాజరయ్యాడు. పరీక్ష అనంతరం తాత కాడే పట్టాడు. తండ్రిని, తాతను కోల్పోవడంతో ఆ విద్యార్థి కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ ఘటన గ్రామంలో అందరిని కలిచివేసింది.

# 4 కిలోల గంజాయి స్వాధీనం

- నిందితులను అదుపులోకి తీసుకున్న త్రీ టౌన్ పోలీసులు..
- వివరాలు వెల్లడించిన ఏసీపీ, సీఐ



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలోని బట్టి రామన్నపల్లి బస్టాండ్ చౌరస్తాలో సుమారు లక్ష రూపాయలు విలువ చేసే సుమారు నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఏసిపి మధు, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ ఎస్సై విజయభాస్కర్ తెలిపారు. శనివారం త్రీ టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ.. కొండపాక మండలం సిరిసినగండ్ల నుంచి గంజాయి తీసుకుని ముగ్గురు యువకులు వస్తున్నారన్న నమ్మదగిన సమాచారంతో బట్టి రామన్నపల్లి బస్టాండ్ వద్ద ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్స్, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఆ ముగ్గురిపై గతంలో మోటార్ సైకిళ్ల దొంగతనాలు, గంజాయి విక్రయం కేసులు కూడా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. గంజాయి సరఫరా చేసే ముఠా విక్రయిస్తున్నట్లు సమాచారం ఉన్నదని.. చిన్న చిన్న ప్యాకెట్లతోపాటు పెద్ద ప్యాకెట్ల వరకు గంజాయి విక్రయం జరుగుతున్నదన్నారు. పట్టుకున్న వారిని నిందితులను విచారించగా.. మరో ఇద్దరు కూడా ఉన్నట్లు చెప్పారని వారు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. నిందితులపై ఇప్పటికే పలు కేసులు ఉండడంతో ఈ కేసును పరిశీలించి పీడీయాక్ట్ పెట్టే అవకాశం ఉందని ఏసీపీ తెలిపారు. కాగా అదుపులో ఉన్నవారు సుక్క సారి భాను ప్రసాద్(21) మహబూబ్నగర్ జిల్లా ప్రస్తుత నివాసం, సిరిసినగండ్ల బోయిని నరేష్(22), గజ్వేల్ మండలం అహ్మదీపూర్ అర్కల శేఖర్(21) గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌కు చెందిన వారిగా ఏసీపీ తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని.. గంజాయి విక్రయించి భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని ఏసీపి హెచ్చరించారు. చాకచక్యంగా వ్యవహరించి గంజాయిని పట్టుకున్న ఎస్సై విజయ్ భాస్కర్‌ను, అఫ్జల్ శ్రీనివాసులను వారు అభినందించారు.

# కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం



నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ జిల్లా సమీకతం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను కలెక్టరర్ మను చౌదరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మరియు డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాస్ రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. గత శాసనసభ ఎన్నికల సందర్భంగా మీడియా సెంటర్ ద్వారా నిర్వహించిన విధుల సమాచారాన్ని డీపీఆర్ రవికుమార్, డీఈ ఐఅండ్‌పిఆర్ తిరుపతి నాయక్‌లు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ (ఎన్‌జి ఎస్‌పి), సి విజిల్ ప్రారంభించిన 1950 డిస్ట్రిక్ట్ కాంటాక్ట్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికలకు సంబంధించిన వివరాలను మీడియా సెంటర్ ద్వారా లోక్‌సభ ఎన్నికల వివరాలను మీడియాకు అందించాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో వచ్చే పెయిడ్ న్యూస్‌ను మానిటర్ చేయాలని, 1950 డిస్టిక్ కాంటాక్ట్ సెంటర్ ద్వారా ఎన్నికల సంబంధం ఫిర్యాదులను స్వీకరించాలన్నారు. సి విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిశీలించి ముగించేలా సంబంధిత ఎన్నికల అధికారులకు సమాచారం అందించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే రాజకీయ సంబంధం అంశాలు ప్రత్యేకంగా పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో రహమాన్, ఎలక్షన్స్ సూపరింటెండెంట్ మధుసూదన్ సమాచార శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 33 శాతం వాటిల్లితేనే పంటనష్టంగా పరిగణించాలి



నవతెలంగాణ-బెజ్జంకి

ప్రభుత్వ నిబంధనల మేరకు సుమారు 33 శాతం నష్టం వాటిల్లితేనే పంటనష్టంగా అధికారులు పరిగణించాలని.. రైతులు అత్యుత్సహంతో పంట నష్టపరిహార జాబితాలో నమోదు చేసుకుంటే పంట దిగుబడి విక్రయ సమయంలో సమస్యలు ఎదుర్కొంటారని హుస్నాబాద్ ఏడీఏ మహేశ్ సూచించారు. ఇటీవల అకాలంగా కురిసిన వడగళ్ల వానకు మండల పరిధిలోని లక్ష్మీపూర్, వడ్లూర్ గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు నమోదు చేసిన రైతుల పంట నష్టపరిహార నమోదు జాబితాను శనివారం ఏడీఏ మహేశ్ ఏఓ సంతోష్, ఏఈఓలు సాయి చరణ్,సాయి శంకర్, బాధిత రైతులతో కలిసి నెలకొరిగిన పంటలను క్షేత్ర స్థాయిలో సందర్శించి పరిశీలించారు.సుమారు 33 శాతం పంట నష్టం వాటిల్లిన ప్రతి రైతుకు న్యాయం చేకూర్చేల నివేదిక రూపొందించి జిల్లాధికారికి అందజేస్తామని మరో మూడ్రోజుల్లో మండలంలో పూర్తి పంట నష్టపరిహార జాబితాను అందజేయాలని అధికారులకు ఏడీఏ సూచించారు.

# ఓటరన్న మేలుకో.. సరైన నాయకున్ని ఎన్నుకో




నవతెలంగాణ-దుబ్బాక

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని సరైన నాయకున్ని ఎన్నుకోవాలని మండల తహసీల్దార్ నల్ల వెంకట్‌రెడ్డి,మున్సిపల్ కమిషనర్ కళ్యాణ రమేష్ కుమార్ కోరారు. ఎన్నికల రోజున ఎన్ని పనులు ఉన్నా తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. శనివారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని శివాజీ విగ్రహ కూడలి నుండి తెలంగాణ తల్లి విగ్రహ కూడలి వరకు "స్వీప్ ఆధ్వర్యంలో 5కే రన్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయి అధికారులు,ప్రజలతో కలిసి ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ 'ఓటరన్న మేలుకో.. సరైన నాయకున్ని ఏలుకో" అన్న నినాదాలు చేస్తూ భారీ ర్యాలీని నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్,సహాయ ఎన్నికల అధికారి గరివా అగ్రవాల్ ఆదేశాల మేరకు ఈ ర్యాలీని చేపట్టడం జరిగిందని ఎంఆర్ఓ వెంకట్‌రెడ్డి తెలిపారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహ కూడలిలో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ ర్యాలీలో తహసీల్దార్‌లు వీరేష్,జయంత్,డిప్యూటీ తాహసీ ల్దార్ సందీప్, ఆర్ఐ నరసింహారెడ్డి,ఏపీఎం దాకయ్య, ఎంపీఓ నరేందర్ రెడ్డి,శ్యామలాదేవి,మెప్మా సీఈవో రేణుక, మున్సిపల్ సిబ్బంది,మెప్మా సిబ్బంది, బూత్ లెవెల్ అధికారులు, ఐకెపి సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులుపాల్గొన్నారు.


# తేనెటీగల సాగు లాభదాయకం



నవతెలంగాణ-జహీరాబాద్

తేనెటీగల సాగు లాభదాయకమని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే.వరప్రసాద్ అన్నారు. డీడీఎస్ కేవీకే ఆధ్వర్యంలో అగ్రికల్చర్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో మూడ్రోజుల శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకం పై శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పలు జిల్లాల్లో నుంచి రైతులు, యువతీ, యువకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా డా.సి. వరప్రసాద్, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వం యువకులకు సొంత ఉపాధి కల్పించేందుకు అనేక రకాల స్కీమ్స్‌ను తీసుకొస్తుందని.. అందులో భాగంగా తేనెటీగల పెంపకాన్ని కూడా ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. డా.ఎన్ స్నేహలత, సస్య రక్షణ శాస్త్రవేత్త, కోర్స్ ఇన్‌స్ట్రక్టర్‌గా తేనెటీగల పెంపకంపై పూర్తి అవగాహన కల్పించారు. తేనెటీగలు మానవ మనుగడకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను తోడ్పడతాయని తెలిపారు. భూమి పైన ఉన్న పంటలు, అనేక రకాల చెట్లు 80 శాతం తేనెటీగలు చేసే పరాగ సంపర్కంపై ఆధారపడి ఉంటాయన్నారు. తేనెటీగల రకాలు, వాటి నుండి వచ్చే ఉత్పత్తులైన తేనె, పుప్పడి, మకరందం, ప్రొపొలిస్, రాయల్ జెల్లీ, బీ వెనం పదార్థాల గురించి క్లుప్తంగా వివరించి.. వాటికి ఉన్న మార్కెటింగ్ డిమాండ్ గురించి తెలిపారు. వివిధ కాలాల్లో బి బాక్స్‌ను ఎలా మేనేజ్ చేయాలి, తేనెటీగలకు అనుగుణంగా ఉండే పంటలను, మైగ్రేషన్ ప్రాసెస్‌ను, వివిధ రకాల ప్రభుత్వ పథకాలను వివరించారు. సాగర్‌రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్, అగ్రికల్చర్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, డా.సాయి ప్రియాంక, కేవీకే, విస్తరణ శాస్త్రవేత్త వారు, ట్రైనింగ్ అసెస్మెంట్‌ను తీసుకున్నారు. దాని ద్వారా పాల్గొన్న వారికి కేంద్రం నుంచి సర్టిఫికెట్లు అందజేశారు.కార్యక్ర మంలో కేవీకే బృందం, రైతులు, యువతి యువకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎలక్షన్‌రెడ్డిలను పార్టీనుంచి సస్పెండ్ చేయాలి



నవతెలంగాణ- గజ్వేల్

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మెన్ ఎలక్షన్ రెడ్డిలు బీఆర్ఎస్‌లో ఉంటూనే పార్టీకి ద్రోహం చేశారని.. కాబట్టి వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. స్థానిక కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య ఇంట్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యాదవరెడ్డి, ఎలక్షన్‌రెడ్డిలు 2014, 2018, 2023 ఎన్నికల్లో కేసీఆర్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ దగ్గర డబ్బులు తీసుకుని పనిచేశారని ఆరోపించారు. జిల్లా సహకార బ్యాంకు చైర్మెన్‌గా పనిచేసిన ఎలక్షన్‌రెడ్డి 9 ఏండ్లలో1100 ట్రాన్స్ ఫార్లను రైతులకు సరఫరా చేయగా ఒక్కొక్క ట్రాన్స్‌ఫార్మ్‌కు రూ.5000 తీసుకున్నారని ఆరోపించారు. అదేవిధంగా 700 ట్రాక్టర్‌లను రైతులకు పంపిణీ చేయగా ఒక్కొక్క ట్రాక్టర్ నుంచి రూ.10,000 వసూలు చేశారని.. ఇందుకు తన వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. 2009లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నర్సారెడ్డి ద్వారా ఎలక్షన్‌రెడ్డి రెండు కోట్లు తీసుకొని బీఆర్ఎస్‌కు ద్రోహం చేశారని ఆరోపించారు. 2009లో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో డైరెక్టర్‌గా పని చేసి భూములను కూడా విక్రయించుకున్నారన్నారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డికి ఆయన పదవి కోసం తాను 157 మంది ప్రజాప్రతినిధులను తన సొంత డబ్బులతో ఇతర ప్రాంతాలకు తీసు కుపోయి ఎన్నికల రోజు తీసుకొచ్చారన్నారు. కేసీఆర్ ఓడిపోతారని తమ బంధువుల వద్ద అనేకసార్లు యాదవరెడ్డి చెప్పుకొచ్చారన్నారు. పార్టీలో ఉండి ద్రోహం చేస్తున్న వారిని వదిలిపెట్టేది లేదని.. ఈ విషయంలో కేసీఆర్, హరీశ్ రావులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తన రాజకీయానికి అడుగడుగున అడ్డుపడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎలక్షన్ రెడ్డిలను పార్టీ నుండి సస్పెండ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. మెదక్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి గెలుపు కోసం కృషి చేస్తానన్నారు.

# ఎంపీ సీటును అమ్ముకున్న బీఆర్ఎస్

- బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపణలు



నవతెలంగాణ-సిద్దిపేట

'13 ఏండ్లు తెలంగాణ ఉద్యమ పోరాటం చేశారు. పదేండ్లు రాష్ట్రాన్ని పాలించారు. మీకు క్యాడర్ దొరకడం లేదా? ఎంపీ టికెట్ కోసం పక్క జిల్లా నుంచి అరువు తెచ్చుకున్నారు. ఎంపీ సీటును అమ్ముకున్నారు' అంటూ బీఆర్ఎస్‌పై బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు తీవ్ర ఆరోపణలు చేశారు. పట్టణంలోని శివానుభవ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం ప్రారంభం నాటి నుంచి కేసీఆర్ వెంట నడిచిన ఉద్యమకారులకు ఎంపీ టికెట్ విషయంలో మరోసారి మోసం చేశారన్నారు. 20 ఏండ్లుగా పక్క జిల్లాకు చెందిన హరీశ్‌రావుని జిల్లా ప్రజలు భరిస్తున్నారన్నారు. జిల్లాలో బీఆర్ఎస్‌కు అభ్యర్థుల కరువైనట్టు డబ్బులకు ఆశపడి మెదక్ ఎంపీ అభ్యర్థిగా వెంకట్రాం రెడ్డిని ప్రకటించారన్నారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా వేలాది మంది భూములు లాక్కొని నిర్వాసితులను అరిగోస పెట్టిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాగోతాన్ని బట్టబయలు చేస్తామని హెచ్చరించారు. ఓ ఉద్యోగికి ప్రమాదం జరిగితే.. అతను బాగుపడితే తలనీలాలు సమర్పిస్తానని వెంకట్రామిరెడ్డి మొక్కుకున్నాడని ఓ పేపర్లో చదివానన్నారు. అయితే రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఎంతమందిని ఇబ్బందుల పాలు చేశాడో గుర్తుంచుకోవాలని.. అమరవీరుల స్తూపం వద్ద వెంకట్రాంరెడ్డి ముక్కు నేలకు రాసిన పాపం పోదన్నారు. సూట్ కేసులు మోసి ఓట్లు కొనుగోలు చేద్దామను కొంటున్న బీఆర్ఎస్ నాయకులకు బుద్ధి చెప్పడానికి మెదక్ జిల్లా ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజావాణి ద్వారా కలెక్టర్ ప్రజలకు న్యాయం చేశామని బీఆర్ఎస్ కార్యకర్తలు అంటున్నారని, ప్రజావాణిలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయో.. వాటిలో ఎన్ని పరిష్కరించావో బయటపెట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాయకులు వంగ రామచంద్ర రెడ్డి, ఉమారాణి, మార్కండేయులు, నరేష్, విభీ షణ రెడ్డి, ఉపేందర్,దినేష్, జ్యోతిరెడ్డితదితరులు పాల్గొన్నారు.

# అడుగడుగునా నర్సారెడ్డి కబ్జాలు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అడుగడుగునా భూకబ్జాలు చేశారని, నామినేటెడ్ పదవులను లక్షలకు కట్టబెట్టేందుకు సిద్ధమవుతున్నారని ఎఫ్డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలో కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య ఇంటిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడుతూ.. గజ్వేల్ పట్టణంలో బట్టల మిల్లు, నల్లాల భాయి స్థలాన్ని ఎవరు కబ్జా చేశారని ప్రశ్నించారు. కబ్జాల చరిత్ర నర్సారెడ్డికి ఉందని విమర్శించారు. సింగపల్లి కాఫీ కంపెనీ వద్ద భూమిని ఎవరు ఆక్రమించారని ప్రశ్నించారు. రాజీవ్ రహదారి రోడ్డు విస్తరణ లో చెట్లను అమ్ముకున్నది ఎవరన్నారు. కాంగ్రెస్ సమయంలో యూరియా లారీలను రాత్రి రాత్రి గజ్వేల్ నియోజకవర్గం దాటించింది ఎవరు అన్నారు. 2009, 2014లో ఎలక్షన్ రెడ్డి ద్వారా అమ్ముడుపోయావని ఎన్ని కోట్లు తీసుకున్నావో లెక్కలు ఉన్నాయన్నారు. 2014, 2018లో కాంగ్రెస్ పార్టీని అమ్ముకున్నామని కోట్ల రూపాయలు తీసుకొని ఫోన్ స్విచ్ఆఫ్ చేసుకున్నారని దుయ్యబట్టారు. దళారీ ద్రోహి అనే పదాలు ఎలక్షన్‌రెడ్డికి వర్తిస్తాయన్నారు. 2018లో కాంగ్రెస్ నుంచి తాను పోటీ చేస్తే.. ఎలక్షన్‌రెడ్డి కేసీఆర్‌కు అమ్ముడుపోడని విమర్శించారు. పార్టీకి ద్రోహం చేశారన్నారు. 2018 నుంచి 2023 వరకు కాంగ్రెస్‌లో మీరు ఎక్కడున్నారని.. పార్టీ కోసం కష్టపడ్డ పని చేసిన నాయిని యాదగిరి, వెంకటరామ్ రెడ్డి, వర్గల్ నరేంద్రలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కానీ పదవులను అమ్ముకుంటున్నారన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో ఎన్ని డబ్బులు వసూలు చేశారో తన వద్ద చిట్టా ఉందని త్వరలోనే బయట పెడతానన్నారు.

## నేడు సిద్దిపేటలోని మార్కండేయ ఆలయంలో కోటి తలంబ్రాల దీక్ష

నవతెలంగాణ-గజ్వేల్

సిద్దిపేట లోని మార్కండేయ స్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం కోటి తలంబ్రాల దీక్ష కార్యక్రమం ఉందని గజ్వేల్ లోని శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు తెలిపారు. భద్రాచల రామయ్య కల్యాణానికి గోటితో వడ్లను వొలిచి తలంబ్రాలుగా తయారుచేసే కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం నరేష్ చారి, అయిత శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు.

## హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ జడ్పీటీసీ



**నవతెలంగాణ-ఐడీఏబొల్లారం**

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును ఆయన నివాసంలో జిన్నారం మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నేత కొలను బాల్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి పెద్ద ఎత్తున వలసలు కొనసాగుతున్నాయనే వార్తలు వస్తున్న నేపథ్యంలో మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బీరప్ప యాదవ్, బీసీ కాలనీ బీఆర్ఎస్ యువత నాయకుడు లడ్డు, గణేష్,చందు, జాషువా తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు



**నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్**

నారాయణఖేడ్ మండలంలోని సత్యగామా, జూకల్ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ 60 కుటుంబాలు ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరాయి. వారికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ రాజ్యమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. పార్టీలో చేరిన వారిలో గైని కిష్టయ్య, మాజీ వార్డు సభ్యులు, సంగమని సునీల్, సాయిలు, నర్సింలు, సంగమేష్, మొగులమ్మ, శ్రీదేవి, నీలమ్మ శ్రీకాంత్, రత్నయ్య, మహేష్, వీరయ్య, సుశీల తదితరులు ఉన్నారు.



## శాంతి భద్రతలకు కృషి చేయాలి

**నవతెలంగాణ-ఐడీఏబొల్లారం**

బొల్లారం మున్సిపల్ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గంగాధర్‌ను రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పలువురు కౌన్సిలర్లు శనివారం మర్యాదపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డితో కలిసి కౌన్సిలర్లు సీఐని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపాల్టీలో శాంతి భద్రతల స్థాపనకు కృషి చేయాలని ఈ సందర్భంగా చంద్రారెడ్డి సీఐని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణలో తమ సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. మున్సి పాల్టీకి రావడం పై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో కౌన్సిలర్లు గోపాలమ్మ , చంద్రయ్య, ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.లక్ష్మారెడ్డి, సంపత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రమణయ్య, మాజీ ఎంపీటీసీ కృష్ణంరాజు, రాజ్ గోపాల్, చంద్రారెడ్డి, పరుశురాం, వెంకటయ్య, నర్సింహా రాజు, వెంకీ తదితరులు పాల్గొన్నారు.



## ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ

**నవతెలంగాణ-ఐడీఏబొల్లారం**

బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీరప్ప బస్తిలో ముస్లిం మైనార్టీ సోదరులు శనివారం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిలుగా జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి, జిన్నారం మాజీ ఎంపీపీ కొలను రవీందర్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ వేడుకల్లో మజీద్ వ్యవస్థాపకులు ఉస్మాన్ ,శబాజ్, రషీద్, ముభిన్, ఖాసీం, ఇమ్రాన్ ఖాన్, ముక్తర్, పాషా, షాన్, జాషువా, మరియు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



## కృత్రిమ కాలు ఏర్పాటుకు ఆర్థిక సాయం

**నవతెలంగాణ-రామచంద్రాపురం**

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెలతాండాలో నివసించే యువకుడు చాలా రోజుల నుంచి ఒక కాలు లేక బాధపడుతున్నాడు. ఆ యువకునికి కృత్రిమ కాలు ఏర్పాటు చేయాలని తండావాసులు తెల్లాపూర్ మున్సిపాల్టీ వైస్‌చైర్మెన్ రాములు గౌడ్‌ను కోరగా. ఆయన వెంటనే స్పందించి యువకునికి ఆర్థిక సాయం అందించారు. దాంతో తాండావాసులు సంతోషం వ్యక్తం చేశారు. యువకుడిని శనివారం వైస్‌చైర్మెన్ రాములుగౌడ్ తనయుడు సాయిచరణ్‌గౌడ్ పరామర్శించారు.



## కస్తూర్బాలో 'వాయిస్ ఫర్ గర్ల్స్' పరిచయ శిబిరం

**నవతెలంగాణ-సదాశివపేట**

సదాశివపేటలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో శనివారం 'వాయిస్ ఫర్ గర్ల్స్' పరిచయ శిబిరాన్ని నిర్వహించారు. సంగారెడ్డిలోని 10 కేజీబీవీల్లో పదిరోజుల పాటు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాగా సదాశివపేట కేజీబీవీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో 64 మంది విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. 2011లో స్థాపించబడిన వాయిస్ ఫర్ గర్ల్స్ సంస్థ భారతదేశంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో అట్టడుగున ఉన్న కౌమర దశలోని బాలికల సాధికారత కోసం ద్వి వార్షిక ప్రాతిపదికన క్యాంపులను నిర్వహిస్తున్నది. గత దశాబ్దంలో భారతదేశంలోని 2,44,500 మంది కౌమార దశలోని విద్యార్థిణులకు ఈ వాయిస్ ఫర్ గర్ల్స్ చేరుకుంది. కాగా వాయిస్ ఫర్ గర్ల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనూష భరద్వాజ్ మాట్లాడుతూ.. సరైన జ్ఞానం మరియు నైపుణ్యాలను అందించినప్పుడు అమ్మాయిలు తమ జీవితాలు మరియు వారి చుట్టూ ఉన్న వ్యక్తులను కూడా మార్చగలరన్నారు. కేజీబీవీ సదాశివపేట పాఠశాలలో ప్రత్యేకాధికారి లలిత మరియు పాఠశాల సిబ్బంది సహకారంతో వాయిస్ టీం అయినా మౌనిక మరియు సుమాంజలి పత్తిపాటి, సారిక, దోమ నికిత, చిట్యాల గౌతమి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



## సెయింట్ ఆంథోనీస్‌లో అచీవ్మెంట్ అవార్డుల ప్రదానోత్సవం

**నవతెలంగాణ-సంగారెడ్డి**

సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో శనివారం 5నుంచి 8వ తరగతి విద్యార్థులకు అచీవ్మెంట్ అవార్డుల పురస్కార కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఈ.కరుణాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఈ.అరుణా రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఈ.విజయ కుమార్ రెడ్డిలు సరస్వతీ మాత చిత్రపటం ఎదుట జ్యోతి ప్రజ్వలన గావించి.. పటాన్ని పూలమాలతో అలంకరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చదువులో, ఉత్తమ హాజరు శాతంలో, ఆటల పోటీల్లో, క్రమశిక్షణలో, ఎస్ఎస్‌సీలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని ప్రతిభాపాటవాలను కనబరిచిన విద్యార్థుల నైపుణ్యాలను పరిగణలోనికి తీసుకుని వ్యక్తిగతంగా అచీవ్మెంట్ అవార్డులు ప్రదానం చేసినట్టు చెప్పారు.ఇలా ప్రోత్సాహించడం వల్ల చదువులో కాకుండా విద్యార్థులు అన్నిరంగాల్లో చురుగ్గా పాల్గొని.. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తారన్నారు. ప్రతి మనిషికి ప్రోత్సాహం తప్పక అవసరమనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆంథోనీస్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత పోరాడాలి

- రాజ్‌గురు, సుఖ్‌దేవ్, భగత్‌సింగ్
- వర్థంతి సందర్భంగా ఘనంగా నివాళ్లు
- వారికి భారతరత్న ఇవ్వాలని పలువురి డిమాండ్













**నవతెలంగాణ-సంగారెడ్డి**

రాజ్‌గురు, సుఖ్‌దేవ్, భగత్‌సింగ్ వర్థంతి కార్యక్రమాలను శనివారం ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు నివాళ్లర్పించి.. వారి ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు పిలుపునిచ్చారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1931 మార్చి 23న భారత స్వాతంత్ర విప్లవకారులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను బ్రిటిష్ ప్రభుత్వం ఉరి తీసిందన్నారు. ఆ ముగ్గురు విప్లవానికి నిలువుటద్దంగా నిలిచారన్నారు. బ్రిటిష్ దుర్మార్గపు పాలనలో చిక్కుకున్న భారతదేశానికి విముక్తి కలిగించేలా.. దేశ ప్రజల్లో విప్లవ స్ఫూర్తిని నింపిన యోధులని కొనియాడారు. దేశంలో జరుగుతోన్న మత విద్వేషాలకు వ్యతిరేకంగా దేశ భక్తిని పెంపొందించుకోవాలంటే అలాంటి మహనీయుల జయంతి, వర్థంతిలను జరుపుకోవాలని సూచించారు. వలస పాలకుల వెన్నులో దడ పుట్టించి 23 ఏళ్లకే ఉరికొయ్యలను ముద్దాడిన భగత్ సింగ్ ను నేటి యువత ఆదర్శంగా తీసుకొని హక్కుల కోసం పోరాడాలని పిలుపనిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, మానిక్, నాయకులు నర్సింహులు, ప్రవీణ్, విద్య సాగర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ సామ్రాజ్యవాదుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన విప్లవ కెరటం భగత్ సింగ్ అని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజయ్య, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరిలు అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భగత్ సింగ్ స్ఫూర్తితో రాజ్యాంగం ప్రజాస్వామ్యం పరిరక్షణకు, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. 23 ఏళ్లకే ఉరికొయ్యలను ముద్దాడిన భగత్ సింగ్.. 'నా జీవితం కన్నా ఈ దేశమే గొప్పది' అని చెప్పిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా రైతులు, కార్మికులు, పేదల హక్కుల కోసం భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్, సీఐటీయూ నాయకులు బాబురావు, దత్తు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షులు రాహుల్ మాటాడుతూ.. స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడిన గొప్ప వ్యక్తులు అని కొనియాడారు. వారి స్ఫూర్తితో నేటి యువత పోరాటాలు చేయాలని పిలుపనిచ్చారు.ఈ కార్యక్రమంలో సభ్యులు అఖిల్, రఘు, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

**నారాయణఖేడ్‌రూరల్ :** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఖేడ్ సీఐటీయూ కార్యాలయంలో భగత్‌సింగ్, రాజు గురు, సుఖదేవ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కే.సతీష్ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భగత్‌సింగ్ లాంటి అనేక మహానుభావుల చరిత్రను విద్యార్థులకు తెలియనియకుండా చేస్తున్నారన్నారు. విద్యార్థులు భగత్‌సింగ్‌ను ఆదర్శంగా ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శశిధర్,చంద్రశేఖర్ బాలాజీ, అనిల్, చంద్రకాంత్ కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు మోసప్ప, డీవైఎఫ్ఐ నాయకులు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐడీఎఫ్ఎస్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజు గురు, సుఖదేవ్ చిత్రపటాలకు పూల మాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం యుక్తవయసులో ఉరికంబాన్ని ముద్దాడిన సమరయోధులు భగత్‌సింగ్ అని కొనియాడారు.కార్యక్రమంలో పవన్, రమేష్, బన్నీ, ప్రదీప్, మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవన్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తూ నివాళ్ళర్పించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సీ హెచ్ అశోక్ మాట్లాడుతూ.. నేటి యువత భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఆదర్శం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ డివిజన్ నాయకులు బి.ఇసాక్, నాయకులు పండు, అరవింద్, రాజు, సతీష్, రవికుమార్ పాల్గొన్నారు.

**జోగిపేట, వట్‌పల్లి :** ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జోగిపేట ఎస్సీ హాస్టల్‌లో, వట్‌పల్లి మండల కేంద్రంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ.. బ్రిటిష్ ప్రభుత్వ ఆధిపత్యం, దోపిడీ, పెత్తనానికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప స్వతంత్ర పోరాట యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అని అన్నారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదంతో యువకులను, ప్రజలను స్వతంత్ర ఉద్య మంలో భాగస్వాములు చేశారన్నారు. నేటి దేశ పాలకులు వివిధ రాజకీయ పార్టీలు భగత్‌సింగ్ ఫోటో పెట్టుకొని అధికారానికి వచ్చారని.. కానీ వారి ఆశయ సాధనకు కృషి చేయడం లేదన్నారు భగత్‌సింగ్ ఆలోచనలు, లక్ష్యం, ఆశయాలకు ఎటువంటి సంబంధం లేని రాజకీయ పార్టీలు భగత్ సింగ్ బొమ్మ పెట్టుకోని ఓట్లు అడగడం సిగ్గుచేటు అని అన్నా రు. భారత స్వతంత్ర ఉద్యమంలో సంబంధం లేని వ్యక్తుల చరిత్రను పుస్తకాల్లో పెడుతున్నారని.. కానీ భగత్‌సింగ్ చరిత్రను పాఠ్య పుస్తకాల నుంచి తొలగించారని మండి పడ్డారు. కాబట్టి బీజేపీ ప్రభుత్వాన్ని పార్లమెంటు ఎలక్షన్‌లో యువకులు, ప్రజలు అందరూ కలిసికట్టుగా ఓడించి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో జోగిపేటలో ఎస్ఎఫ్ఐ, నాయకులు అశోక్, సాయి, రాజు, వికాస్, శ్రీకాంత్, ప్రశాంత్, సందీప్, కుమార్, వట్‌పల్లిలో శ్రీకాంత్, శిరీష, ప్రశాంత్, సందీప్, రామకృష్ణ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఎంసీఎంసీ మీడియా సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్




**నవతెలంగాణ-సంగారెడ్డి**

పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ)ని జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ క్రాంతి వల్లూరు, అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్‌తో కలిసి శనివారం పరిశీలించారు. మీడియా కోసం అందుబాటులో ఉన్న సదుపాయాలను, ఎంసీఎంసీ పనితీరుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. మెదక్, కామారెడ్డి జిల్లాల ఎంసీఎంసీ నొడల్ అధికారులతో కలిసి ఎప్పటికపుడు మీడియా సర్టిఫికేషన్ అండ్ మోనిటరింగ్ కమిటీ, సోషల్ మీడియాలో వచ్చే పోస్టుల పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికలు పారదర్శకంగా నిష్పక్షపాతంగా నిర్వహించడానికి మీడియా సహకారం అందించాలని కోరారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ)ఏర్పాటు ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, పత్రికల్లో ప్రచురించిన రాజకీయ ప్రకటనలు అభ్యర్థి ఎన్నికల వ్యయంలో నమోదు చేయడం జరుగుతుందన్నారు. శాటిలైట్ ఛానల్‌లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, సోషల్ మీడియా,ఈ పేపర్ లో ప్రకటనలు, బల్క్ ఎస్ఎంఎస్, వాయిస్ మెసేజ్‌లు, ఇతర ఆడియో-వీడియో విజువల్ మీడియాలతో సహా రాజకీయ ప్రకటనలను ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాల్సి ఉంటుందన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టిసారించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి మీడియా సహకారం అందించాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో డీఆర్ఓ పద్మజా రాణి, జిల్లా పౌర సంబంధాలాధికారి ఏడుకొండలు, ఏవో పరమేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీల్లో పోషణ పక్వాడ కార్యక్రమం

**నవతెలంగాణ-గుమ్మడిదల**

మండలంలోని అన్నారం కేసీఆర్ కాలనీలోని అంగన్వాడి కేంద్రంలో శనివారం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌష్టికాహారంపై చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలో చివరి రోజు కావడంతో మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులతో అంగన్వాడీ టీచర్ ఫాతిమా బేగం ప్రతిజ్ఞ చేయించి.. అనంతరం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహి ం చారు. చిన్నారులకు పోషక విలువలు ఎక్కువ ఉన్న ఆహా ం౯ం తినిపించాలని సూచించారు. ప్రతీ ఒక్కరి ఇంట్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకొని వివిధ రకాల ఆకుకూరలతో కూడిన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, ఆయా సలోమి తదితరులు పాల్గొన్నారు.




## ఉద్యోగమేల పరీక్ష విజయవంతం

**నవతెలంగాణ-సంగారెడ్డి**

టీఏఎస్‌కే తెలంగాణ రాష్ట్ర కౌశల్య విజ్ఞాన వికాసం పిరమిడ్ ఫైనాన్స్ కంపెనీ, సెంట్ ఆంథోనీస్ మహిళా డిగ్రీ కళాశాల సంగారెడ్డి ఆధ్వర్యంలో సెయింట్ ఆంథోనీస్ మహిళా డిగ్రీ కళాశాల సంగారెడ్డి ఆడిటోరియంలో ఉద్యోగ మేళాకు సంబంధించిన పరీక్షను శనివారం నిర్వహించారు. ఈ ఉద్యోగమేళాలో టీఏఎస్‌కే రిలేషన్షిప్ మేనేజర్ ముత్యం కుమార్, ప్లేస్మెంట్ ఎగ్జిక్యూటర్ మానస్‌లు, ఫిరమిల్ ఫైనాన్స్ జీఈఓ హెడ్ స్వామి నాయుడు, తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ హెచ్ ఆర్ టెక్నీషియన్లు భావన మానసలో సెయింట్ ఆంథోనీస్ మహిళా డిగ్రీ కళాశాల తరపున ప్రిన్సిపల్ జవహర్, అకాడమిక్ కౌన్సిలర్ కృష్ణకుమారి, అహ్మద్ పాల్గొన్నారు.

## దుబ్బాకలో చెల్లని రఘునందన్‌రావు, ఎంపీగా ఎట్లా చెల్లుతారు

**సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**




**నవతెలంగాణ-సంగారెడ్డి**

దుబ్బాకలో చెల్లని రఘునందన్‌రావు, మెదక్ ఎంపీగా ఎట్లా చెల్లుతారు అని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఎద్దేవా చేశారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డిపై మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు చేసిన వ్యాఖ్యలన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. 'గురిగింజ కింద ఉన్న నలుపు.. దాంది దానికి కనిపించదట.. బీజేపీ వాళ్ళ మాటలు కూడా అలానే ఉన్నాయి' అంటూ తీవ్రంగా విమర్శించారు. మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి పక్క లోకల్ అని.. గతంలో ఉమ్మడి జిల్లాలో పీడీగా, జాయింట్ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉన్నదని.. మరి నీకేం ఉన్నదని రఘునందన్‌రావును ప్రశ్నించారు. రెండు మూడు ముచ్చట్లు మాట్లాడగానే.. పోటీలోకి వస్తాను అనుకోవడం నీ భ్రమ అంటూ దుయ్యబట్టారు. బంగారు లక్ష్మణ్ సతీమణి రాజస్థాన్‌లో ఎంపీగా పోటీ చేయలేదా..! మోడీ గుజరాత్‌ను వీడి ఉత్తరప్రదేశ్‌లో పోటీ చేసిన విషయాన్ని మర్చిపోయావా అని మండిపడ్డారు. ఈటల రాజేందర్ కరీంనగర్ వీడి మల్కాజ్‌గిరి నుంచి పోటీ చేయడం లేదా అని అన్నారు. జిల్లాలో చేసిన ఉద్యోగంతో ప్రజా సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉందన్నారు. రాష్ట్ర ,కేంద్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగ`డుతూ... ప్రజా సమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తారన్నారు. గత 10 ఏండ్లలో రాష్ట్రానికి కేంద్రం చేసిన అభివృద్ధి చూపి, వచ్చే ఐదు ఏండ్లు కేంద్రం నుంచి ఏం తీసుకొస్తారో చెప్పి ఓట్లు అడగాలన్నారు. బీఆర్ఎస్ పై బురద చల్లే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు. వందకి వందశాతం మెదక్ పార్లమెంట్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాసాల బుచ్చిరెడ్డి, నరహరి రెడ్డి, చక్రపాణి, శ్రీనివాస్, చేర్యాల ప్రభా కర్, శ్రావణ్‌రెడ్డి, శ్రీకాంత్, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సీసీరోడ్ల నిర్మాణాల్లో నాణ్యతా లోపం

**నవతెలంగాణ -కొండాపూర్**

మండల పరిధిలోని పలు గ్రామాల్లో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణాల్లో నాణ్యతా లోపం స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కంకర, సిమెంట్, ఇసుక వాడాల్సి ఉండగా.. పూర్తి మొత్తంలో డస్ట్ కంకర వాడుతున్నారని ఆరోపిస్తున్నారు. వాగుల్లోని ఇసుకను తోడుకొచ్చి ఉపయోగిస్తున్నారి విమర్శిస్తున్నారు. రోడ్ల నిర్మాణాల్లో ఎలాంటి నాణ్యత ఉండట్లేదని మండిపడుతున్నారు. ఈ విషయంపై సంబంధిత పంచాయతీ ఏఈ కృష్ణకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణాల్లో కనీసం ప్రమాణాలు పాటించకుండా, నాసిరకం రోడ్లు వేసి, క్యూరింగ్ కూడా చేయట్లేదని ఆరోపించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా పనులు చేపడుతున్నా.. సంబంధిత అధికారులు మాత్రం తనిఖీలు చేపట్టడం లేదని చెబుతున్నారు. క్వాలిటీ కంట్రోల్ సెల్ కూడా పట్టించుకోకపోవడం అనుమానాలకు దారితీస్తున్నదని విమర్శలు చేస్తున్నారు. క్వాలిటీగా వేయలేని రోడ్లను తిరిగివేయాలని, పంచాయతీరాజ్ ఏఈపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




## పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ



నవ తెలంగాణ-నిజాంపేట్

మండలం కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌ను శనివారం తూప్రాన్ డీఎస్పి వెంకట్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూప్రాన్ డీఎస్పీగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారిగా నిజాంపేట పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. పోలీస్ స్టేషన్లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించామని గ్రామాలలో సీసీ కెమెరాలు ద్వారా దొంగతనాలు అరాచకాలు అరికట్టవచ్చున్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రయాణికులు రూ.50 వేల పైబడి డబ్బులు తీసుకెళ్తే ఆధారాలు సైతం ఉండాలన్నారు. లేకపోతే వాటిని స్వాధీనం చేసుకొని ఎన్నికల అనంతరం సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించినట్లయితే తిరిగి ఇచ్చేందుకు అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట సిఐ వెంకటేష్, ఎస్సై శ్రీనివాస్ రెడ్డి, ఏ ఎస్ ఐ జైపాల్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సునీత, వేణుగోపాల్, వినోద్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆర్డీఓ



నవతెలంగాణ-నిజాంపేట

మండల తహసిల్దార్ కార్యాలయాన్ని మెదక్ ఆర్డిఓ రమాదేవి శనివారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించడం జరిగిందని మండల తహశీల్దార్ భవనం కోసం నూతన భవనాన్ని పరిశీలించడం జరిగిందని అదేవిధంగా జాతీయ రోడ్డు వెడల్పులో భాగంగా నందిగామ గ్రామంలోని పోలింగ్ బూతు స్కూలు విద్యార్థుల బాత్రూంలు తొలగించినందున వాటిని పరిశీలించి ప్రభుత్వం నుంచి పునర్నిర్మించేలా తగు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎల్.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అడుగంటిన భూగర్భ జలాలు.. ట్యాంకర్లతో వరికి నీరు



నవతెలంగాణ-నిజాంపేట

మండలంలోని చల్మేడ గ్రామానికి చెందిన బాజా బాబు అనే రైతు తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో వరి పంట సాగు చేశాడు. పంట ప్రారంభ దశలో నీటి తడులు బాగానే అందడంతో పంట ఏపుగా పెరిగింది. జనవరి, ఫిబ్రవరి నెలలలో ఎండలు ముదిరే కొద్దీ భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోరు నుంచి వచ్చే నీళ్ళు పంటకు సరిపోవడం లేదని రైతు వాపోతున్నాడు. బోరు నీళ్ల పోయకపోవడంతో రూ.1.50 లక్షలు ఖర్చు పెట్టి రెండు బోర్లు వేసినా చుక్క నీరు కూడా పడకపోవడంతో పొలం ఎండి పోకుండా ట్యాంకర్ల ద్వారా నీళ్లను అందిస్తున్నాడు రైతు. నెల రోజుల నుంచి రోజు ఐదు కిలోమీటర్ల దూరం నుంచి పది ట్యాంకర్ల ద్వారా నీళు తీసుకుని వచ్చి పొలానికి అందిస్తున్నానని రైతు వివరించారు. ఒక ట్యాంకర్‌కు రూ.800 ఖర్చు వస్తుందని రైతు చెబుతున్నారు. ప్రభుత్వం ఏమైనా సాయం అందించాలని రైతు కోరుతున్నాడు. గతంలో కురిసిన వడగళ్ల వానకు పంట నష్టం జరిగిందని.. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని రైతు కోరుతున్నాడు.

# బీటీ రోడ్డు రూటు మార్చింది ఎవరు..?

- ప్రొసిడింగ్ ఒకచోట పనులు, మరోచోట. నా...?
- ఇదేం తీరు....



నవతెలంగాణ-టేక్మాల్

బీటీ రోడ్డు రూటులు మారిస్తే ఊరుకునేది లేదని చంద్రుతాండ గిరిజనులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఇటీవల ప్రత్యేక అభివృద్ధి నిధుల పేరా మంజూరీ చేసిన బీటీ రోడ్లు, మండల పరిధిలోని ఆయా తాండాలను కలుపుతూ బీటీ రోడ్లు పిడబ్ల్యుడి వరకు నిర్మాణాలు చేపట్టాల్సిందిగా ప్రొసిడింగులు గతంలోనే వచ్చాయి. కానీ మండల పరిధిలోని చంద్రు తాండ పిడబ్ల్యుడి రోడ్డు మంజూరి అయింది. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.2.27 కోట్లు మంజూరి చేశారు. ఈ రోడ్డును వాసు రామ్ తండా నుంచి, ఏనే పిడబ్ల్యుడి రోడ్డు నుంచి అప్పట్లో ప్రొసిడింగ్ వచ్చింది. ప్రస్తుతం అధికారులు, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ సదానందం తనకు అనుగుణంగా ఈ రోడ్డు ప్లానును మార్చి, అచ్చనపల్లి గ్రామం మీదుగా వెళ్లే పిడి డబ్ల్యూ రోడ్డు మీదుగా వేస్తున్నారని ఆ గ్రామానికి చెందిన యువకులు ఆరోపిస్తున్నారు. ఈ నిధులు ట్రైబల్ వెల్ఫేర్ నుంచి మంజూరి అయ్యాయి, కాబట్టి తండాలలోనే అభివృద్ధి పనులు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇదివరకే బీటీ ఉన్న రోడ్డును చెరిపివేసి అచ్చన్న పల్లి గ్రామం మీదుగా పిడి డబ్ల్యు రోడ్డుకు రోడ్డు వేయడంలో ఆంతర్యమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం మంజూరి చేసిన నిధులను గ్రామాలలో వెచ్చించి అభివృద్ధి చేయడం మంచిది కాదని, అధికారులు ఈ పద్ధతిని మార్చుకోవాలని వారు సూచిస్తున్నారు.

**ఎవరు మార్చారు**

గతంలో అధికారులు ఎస్టిమేషన్ వేసిన ప్రొసిడింగ్ కాపీలలో ఉన్న ప్లాన్‌ను మార్చి కొత్త ప్లాను ఎవరు మార్చారని గిరిజనులు అధికారుల తీరును దుయ్యబడుతున్నారు.

# కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దాడులను ఆపాలి



**జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం**

నవతెలంగాణ-మెదక్

బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దాడులను ఆపాలని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం పేర్కొన్నారు. శనివారము మెదక్ కేవల్ కిషన్ భవన్ వద్ద సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలపై, ప్రతిపక్షాలపై, రాజ్యాంగ వ్యవస్థలపై తీవ్రమైన దాడులు చేస్తుందన్నారు. అవినీతి అనే పేరుతో కేవలం ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వ నేతలపైనే గాక రాష్ట్ర ప్రభుత్వ నేతల పైన ఈడీల పేరిట దాడులు చేస్తూ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిరంకుశత్వాన్ని రాజ్యాంగ వ్యవస్థల దుర్వినియోగాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా మెదక్ లో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. బీజేపీ రాబోయే ఎన్నికల్లో లబ్ధి పొందాలనే దురుద్దేశంతోనే న్యాయవ్యవస్థను, ఎన్నికల వ్యవస్థను అన్ని రకాల వ్యవస్థలను తనకు అనుకూలంగా మార్చుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థను దుర్వినియోగాన్ని ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలపై దాడులను ఆపాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. ఒకవేళ ఆపకపోతే రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సంతోష్, గీత, నాయకులు లచ్చ గౌడ్, షౌకత్, ఆశయ్య, సత్యం, రాణి, పాల్గొన్నారు.

# మీడియా స్వేచ్ఛ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి

- జర్నలిస్టుల డిమాండ్లను కేంద్రం పరిష్కరించాలి
- టియూడబ్ల్యూజె జిల్లా అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి డిమాండ్
- మెదక్‌లో భగత్ సింగ్‌కు నివాళులు



నవతెలంగాణ - మెదక్

జర్నలిస్టుల భద్రత, రక్షణ, మీడియా స్వేచ్ఛ కోసం కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని టియూడబ్ల్యూజె జిల్లా అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి పేర్కొన్నారు. భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) పిలుపుమేరకు శనివారం మెదక్ పోస్ట్ ఆఫీస్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా సమస్యలను పరిష్కరించడానికి కొత్త మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. జర్నలిస్టుల డిమాండ్‌లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ప్రధాన అంశాలపై దృష్టి పెట్టి జర్నలిస్ట్ డిమాండ్ డేగా పాటించాలని నిర్ణయించిందన్నారు. ప్రెస్ కమిషన్ చివరి నివేదిక 1982లో వెలువడిందన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా దేశంలో ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియా రాకతో మీడియా దృష్టాంతంలో పెనుమార్పు వచ్చిందన్నారు. జర్నలిస్టులు, మీడియా సంస్థల భద్రత కోసం, ఆ ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడానికి జర్నలిస్టులకు స్వేచ్ఛ చాలా ముఖ్యమైనదన్నారు. ఆ స్వేచ్ఛ అంతకంతకూ దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్కింగ్ జర్నలిస్టులు, నాన్ జర్నలిస్టుల కోసం వేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. 2007 సంవత్సరంలో మజితియా వేజ్ బోర్డ్ ఏర్పాటు చేయబడిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ఉద్యోగులకు వేతనాలు రెండుసార్లు సవరించబడ్డాయన్నారు. అయితే వార్తాపత్రిక పరిశ్రమ ఉద్యోగులు ఎక్కువగా పొడిగా మిగిలిపోయారన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, ఎంపీలతో పాటు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ డిమాండ్‌లకు మద్దతివ్వాలని కోరుతూ బిజెపి అధ్యక్షులు నాయని ప్రసాద్, కాంగ్రెస్ అధ్యక్షులు గూడూరి ఆంజనేయులు గౌడ్‌లకు వినతిపత్రాలు అందజేశారు. రాబోయే ఎన్నికల్లోని అజెండాలో వాటిని చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు నాగరాజు, రాష్ట్ర దాడుల వ్యతిరేక కమిటీ సభ్యులు మిన్పూర్ శ్రీనివాస్, ఐజెయూ మాజీ సభ్యులు కంది శ్రీనివాస్ రెడ్డి, ఫారూక్ హుస్సేన్, జిల్లా నాయకులు సుమన్, ఫసియుద్దీన్, మురళీధర్, చింతల రమేష్, సిద్దేశం, రామన్న, గిరి, సుధాకర్, శ్రీనివాస్, గోవర్ధన్ రెడ్డి, శ్రీకాంత్, చంద్రశేఖర్, వసీం తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం



**సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం**

నవతెలంగాణ-మెదక్

భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 93వ వర్ధంతి పురస్కరించుకొని శనివారం మెదక్ పట్టణంలోని కేవలం కిషన్ భవన్‌లో సిపిఎం ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌లు బ్రిటిష్ ప్రభుత్వంలో ఆధిపత్యం, దోపిడీ, పెత్తనానికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప స్వతంత్ర పోరాట యోధులన్నారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదంతో దేశంలో యువకులను, ప్రజలను స్వతంత్ర ఉద్యమంలో భాగస్వాములు చేయడం జరిగిందన్నారు. నేటి దేశ పాలకులు వివిధ రాజకీయ ఆలోచనలు, లక్ష్యం, ఆశయాలకు ఎటువంటి సంబంధం లేని రాజకీయ పార్టీలు భగత్ సింగ్ బొమ్మని పెట్టుకొని ఓట్లు అడగడం సిగ్గుచేటు అని అన్నారు. భారత స్వతంత్ర ఉద్యమంలో సంబంధం లేని వ్యక్తుల చరిత్రను పుస్తకాల్లో పెడుతున్నారని తెలిపారు. కానీ భగత్ సింగ్ చరిత్రను పాఠ్య పుస్తకాల నుంచి తొలగించిన బీజేపీ ప్రభుత్వాన్ని పార్లమెంటు ఎలక్షన్లో యువకులు, ప్రజలు అందరూ కలిసికట్టుగా ఓడించి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం మళ్లీ వస్తే ప్రభుత్వ సంస్థలు ఉండవని, హింస, హత్యలు, దోపిడీ, మతోన్మాదం పెట్రేగిపోతుందని తెలిపారు. అదేవిధంగా భారత ప్రభుత్వం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్ భారత రత్న అవార్డు ప్రకటించి గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని తెలిపారు. భగత్ సింగ్ స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయం సాధన బాటలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సంతోష్, గీత నాయకులు లచ్చ గౌడ్, షౌకత్, ఆశయ్య, సత్యం, రాణి, తదితరులు పాల్గొన్నారు.

# నూతన మెలకువతో వ్యాపార రంగ అభివృద్ధి




**అదనపు కలెక్టర్ రమేష్**

నవతెలంగాణ-మెదక్

నూతన మెలుకువలతో వ్యాపార రంగంలో ఆర్థిక అభివృద్ధి చేకూరుతుందని అదనపు కలెక్టర్ రమేష్ పేర్కొన్నారు. శనివారం మెదక్ పట్టణంలోని చర్చి కాంపౌండ్ ఆవరణలో తెలంగాణ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య వారిచే భారత ప్రభుత్వ వాణిజ్య పరిశ్రమ మంత్రిత్వ శాఖ ద్వారా ఎగుమతులు, దిగుమతుల నిర్వహణ అనే అంశంపై చిన్న తరహా, మధ్య తరహా వ్యాపార పరిశ్రమల దారులకు ఆరు రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రమేష్ మాట్లాడుతూ ఎగుమతులు ప్రోత్సహించే విధంగా చిన్న వ్యాపారులకు ఎగుమతి దిగుమతులకు సంబంధించి వివిధ ప్రక్రియలు, లైసెన్సింగ్ విధానం, భారత ప్రభుత్వ విధానాలు, ఆర్థిక సహాయాలు, డిజిఎఫ్టి, ఎఫ్ఈఎంఏ పాత్ర, తెలంగాణ ప్రభుత్వ మద్దతు విధానాలు గురించిన విషయాలపై అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. పరిశ్రమల విభాగం జనరల్ మేనేజర్ కృష్ణమూర్తి, యువ వ్యవహారాల సమన్వయకర్త పాల్గొని ఉపయోగకరమైన కార్యక్రమమని. దీన్ని అందరూ తమ ఎదుగుదలకు ఉపయోగించుకోవాలని సూచించారు. ఎగుమతి దిగుమతుల నిర్వహణలో అనుభవజ్ఞులైన శిక్షకులు వివిధ వృత్తులకు సంబంధించిన దాదాపు వందమందికి గల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం మెదక్ సమాఖ్య అధ్యక్షులు మీలా జయదేవ్, రమేష్‌లు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన క్రీడల నిర్వహణ అధికారి నాగరాజు, మత్స్య శాఖ అధికారి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్ గౌడ్



నవతెలంగాణ-నిజాంపేట

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా నిజాంపేట మండలంకు చెందిన గుర్రం ప్రశాంత్ గౌడ్‌ను నియమించారు. ఈ సందర్భంగా బీజేవైఎం ఉపాధ్యక్షుడిగా నియమితుడైన శ్రీనివాస్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షుడికి, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అహర్నిశలు పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. జరగబోయే ఎంపీ ఎలక్షన్లో మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు విజయం కోసం తన వంతు పాత్ర పోషిస్తానన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ పటేల్, బిజెపి సీనియర్ నాయకులు వెలుముల సిద్ధరాములు, చింతల శేఖర్, తీగల శ్రీనివాస్ గౌడ్, రామయంపేట పట్టణ అధ్యక్షుడు భాను, ఎమ్మెల్యేస్ రెడ్డి, అవినాష్ రెడ్డి, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## జీతాలు రావడం లేదని జీపీ కార్మికుల నిరసన



నవతెలంగాణ-నిజాంపేట

తమకు నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదని ఆరోపిస్తూ శనివారం నిజాంపేట గ్రామ పంచాయితీ ఎదుట జీపీ కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొద్దున ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మురికి పని చేస్తూ.. బతుకు వెళ్లదీస్తున్నామని తెలిపారు. ఎర్రటి ఎండలో పని చేసున్నా గ్రామ పంచాయితీ జీతాలు చెల్లించడం లేదని వారు ఆరోపించారు. ఎవరు కూడా ఒక్క పైసా నమ్మడం లేదని గ్రామ పంచాయితీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిపి కార్మికులు ఇంద్ర, లక్ష్మీ రవి, మైసయ్య, నాగవ్వ, నర్సవ్వ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ కార్డ్ తొలగింపుపై ఉపాధి హామీ కూలీల నిరసన



నవతెలంగాణ-హవేలి ఘనపూర్

గత సంవత్సరం చేసిన ఉపాధి హామీ పనులకు మూడు వారాల డబ్బులు చెల్లించక పోవడం, గ్రామంలో కొంతమంది ఉపాధి హామీ కూలీల జాబ్ కార్డులు తొలగించడం పట్ల ఉపాధి హామీ కూలీలు నిరసన వ్యక్తం చేశారు. శనివారం మండల పరిధిలోని పోచమ్మరాలు గ్రామంలో ఉపాధి హామీ నిర్వహించే పోచారం డ్యామ్ వద్ద పనులు నిర్వహించే స్థలంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు మాట్లాడుతూ గత సంవత్సరం మూడు వారాలు ఉపాధి హామీ పనులు చేసినా డబ్బులు చెల్లించలేదని ఆరోపించారు. గ్రామంలో సుమారు 50 మంది జాబ్ కార్డులను తొలగించారని నిరసన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనులు స్టార్ట్ అయినప్పటి నుంచి పనులు చేసిన డబ్బులు వచ్చేవని, గత కొంతకాలంగా ఉపాధి హామీ పనులు చేసినా డబ్బులు రావడం లేదని ఆరోపించారు. గతంలో ఉపాధి హామీ పథకంలో కొంతమంది నిర్లక్ష్యం వల్లనే తమకు డబ్బులు సరైన సమయంలో రావడం లేదన్నారు. అధికారులు తక్షణమే చర్య తీసుకొని జాబ్ కార్డులు పునరుదించాలని కోరారు. గ్రామంలో కొంతమంది వ్యక్తుల వల్లనే తమ గ్రామానికి సరైన టైంలో ఉపాధి హామీ డబ్బులు జమ కావడం లేదని ఆరోపించారు. ఈ విషయంలో ఉపాధి హామీ ఇన్చార్జ్ ఏపీవో లక్ష్మణ్‌ను వివరణ కోరగా కొంతమంది ఉపాధి కూలీల జాబ్ కార్డులు తొలగించిన మాట వాస్తవమేనని, తొలగించిన జాబ్ కార్డులను పునరుద్ధరించేలా కృషి చేస్తామని తెలిపారు. ఉపాధి పనులు చేసిన కూలీలకు సరైన సమయంలో వారి అకౌంట్‌లో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి



నవ తెలంగాణ-నిజాంపేట

గతవారం కురిసిన వడగండ్ల ప్రభావం వల్ల ప్రభావితమైన వరి, మొక్కజొన్న క్షేత్రాలను జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ పరిశీలించారు. నిజాంపేట కాశింపుర్ తాండ, జడ్చర్ తండా గ్రామాలలో వ్యవసాయ విస్తీర్ణాధికారులు పంట నష్ట వివరాలను సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ సేకరించిన పంట నష్ట వివరాలను ఉన్నతధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ మండల వ్యవసాయ అధికారి రాజ్ నారాయణతో పాటుగా వ్యవసాయ విస్తీర్ణాధికారులు కావేరి, శ్రీలత, రైతులు సెవాగ్‌లు పాల్గొన్నారు.

## గర్భిణీ బాలింతలు పౌష్టికారం తీసుకోవాలి

అంగన్వాడి టీచర్ పాప రాణి



నవ తెలంగాణ-నర్సాపూర్

గర్భిణీ బాలింతలు ప్రతి రోజు తప్పనిసరిగా ఆకుకూరలు కూరగాయలతో కూడిన పౌష్టికారం తీసుకోవాలని అంగన్వాడీ టీచర్ పాప రాణి అన్నారు. శనివారం నర్సాపూర్ మండల పరిధిలోని ఆవంచ గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ బాలింతలకు పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిరోజు పోషకాహారం తీసుకుంటామని గర్భిణీ బాలింతల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం నిర్మల, ఆశ వర్కర్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రఘునందన్ రావు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో మెదక్ బిజెపి పార్లమెంటు అభ్యర్థి ఎం రఘునందన్ రావు జన్మదిన వేడుకలను బిజెపి మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ రఘునందన్ రావు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని మనసారా కోరుకుంటున్నామన్నారు. మెదక్ బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు విజయం కోసం అహర్నిశలు కష్టపడి పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్ మహంకాళి, చెర్విరాల చంద్రశేఖర్, రాజిరెడ్డి, మెకానిక్ కిషన్, మేకల రమేష్ బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
సిద్దిపేట
ఆదివారం | 24 మార్చి 2024 | www.navatelangana.com

## 5కే రన్ ప్రారంభించిన కలెక్టర్



నవ తెలంగాణ-సిద్దిపేట

లోక్ సభ ఎన్నికలు 2024 ఓటర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 5 కే రన్‌ను జిల్లా కలెక్టర్ మను చౌదరి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు చాలా కీలకమైందని, లోక్ సభ ఎన్నికలలో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గం ఏఆర్ఓ, ఆర్డీవో సదానందం, స్వీప్ నోడల్ అధికారి, డిఆర్డిఓ జగదేవ్, డివై ఎస్ ఓ నాగేందర్, వివిధ క్రీడ సంఘాల సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-చేర్యాల

కురుమలకు కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కురుమ సంఘం చేర్యాల డివిజన్ అధ్యక్షుడు బొట్టు శంకర్, ప్రధాన కార్యదర్శి అందె నాని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చేర్యాల పట్టణ కేంద్రంలో శనివారం కురుమ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 16% ఉన్న కురుమలకు ప్రత్యేక స్థానం కల్పించాలని అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ బీర్లా ఐలయ్య లు గుర్తించి కురుమ కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు.సమావేశంలో కురుమ సంఘం నాయకులు సూర్ణ శ్రీశైలం అందె అశోక్, జంగిలి యాదగిరి, మీస సత్యనారాయణ, అందె బీరయ్య, చిగుళ్ల కొమురయ్య కామల్ల అనిల్, ఒగ్గు రాజు, జయ రాములు తదితరులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ యువతకు స్ఫూర్తి











నవతెలంగాణ-జగదేవపూర్

భారతీయ విప్లవ వీరుడు భగత్ సింగ్ భావజాలాన్ని యువత అందిపుచ్చుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే భగత్ సింగ్ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన విప్లవ వీరుడని కొనియాడారు. ఇరవై మూడు ఏళ్లకే ఉరికొయ్యను ముద్దాడిన ఉద్యమ వీరుడని తెలిపారు. నేటియువత భగత్ సింగ్ అడుగు జాడల్లో నడవాలని సూచించారు. మతం పేరుతో భారతదేశ చరిత్రను చేరిపేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు భానుప్రకాష్ రావు, సుధాకర్ రెడ్డి, బాలకష్ణరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, వివిధ పార్టీ నాయకులు నర్సింహరెడ్డి, బిక్షపతి, శ్రీనివాస్ రెడ్డి, ఐలయ్య, వెంకట్, రాజు, శ్రీరాంరెడ్డి, లింగం, రామకష్ణ రెడ్డి, అంజిరెడ్డి, కుద్దూస్, నవీన్, వెంకట్ రెడ్డి, భాను, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ-సిద్దిపేట

భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని ఆర్ ఎస్ పి పార్టీ జిల్లా ఇంఛార్జి మన్నె కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భగత్ సింగ్ 93 వ వర్ధంతి సందర్భగా రెవల్యూషరీ సోషలిస్ట్ పార్టీ, అఖిల భారత ప్రగతిశీల విద్యార్థిసంఘం ఆధ్వర్యంలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం యుక్తవయసులో ఉరికంబాన్ని ముద్దాడిన సమరయోధుడు భగత్ సింగ్‌ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. భగత్ సింగ్ జీవిత చరిత్రను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యపుస్తకాలలో చేర్చి, ఆయన జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. భగత్ సింగ్‌కు భారతరత్న ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అప్పాల కష్ణ, రవి, ప్రవీణ్, నరేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట

దేశ స్వాతంత్రం కోసం పోరాడిన గొప్ప నాయకుడు భగత్ సింగ్ అని విద్యార్థి ఏ. రాకేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విద్యార్థుల సమక్షంలో భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను కూడా లెక్క చేయకుండా 23 ఏళ్ల వయసులోనే ప్రాణాలు అర్పించిన గొప్ప నాయకుడన్నారు. భగత్ సింగ్ నాస్తికుడుగా జీవిస్తూ మూఢవిశ్వాసాలను వ్యతిరేకిస్తూ యువతను చైతన్యపరచాడన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు సాయి తేజ, రంజిత్, సాజన్, హుస్సేన్, ఈశ్వర్, నిరేష్, కార్తీక్ ,భాను, నవీన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి

భారత దేశ విముక్తి కోసం పోరాటం చేసిన భగత్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మహేశ్ డిమాండ్ చేశారు. భగత్ సింగ్ వర్ధంతి సభలో ఆయన చిత్ర పటానికి సీపీఐ,ఏఐవైఎఫ్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని నవభారత్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో శనివారం భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి క్యాండిల్స్ వెలిగించి విద్యార్థులు ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గంగర వేణి రవి , డైరెక్టర్ వేల్పుల శ్రీనివాస్ , ప్రిన్సిపాల్ వినీష్ , జయ టీచర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## దూసుకెళ్తున్నారు..వేధిస్తున్నారు

**మైనర్ల ర్యాష్ డ్రైవింగ్ పై పలువురి విమర్శలు**
**చూసిచూడనట్టు వ్యవహరిస్తున్న పోలీస్ యంత్రాంగం**
**భయాందోళనలో విద్యార్థినిలు**

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలో మైనర్లు తమ ద్విచక్ర వాహనాలను అతి వేగంగా నడుపుతూ.పెద్దపెద్ద శబ్దాలు చేస్తూ విద్యార్థినీలను వేధింపులకు గురిచేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో విద్యార్థినిలు, వారి తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని బాలికల, బాలుర ప్రభుత్వోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షల కేంద్రాల్లో ఈ నెల 18 నుంచి పది వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షలకు మండలంలోని ఆయా గ్రామాల ప్రభుత్వోన్నత పాఠశాలల నుంచి విద్యార్థిని విద్యార్థులు పరీక్షలకు హజరవుతున్నారు. పరీక్షలు ముగించుకుని విద్యార్థినీలు వారివారి స్వగృహలకు ప్రధాన రోడ్డుపై వేళ్లే క్రమంలో పలువురు మైనర్ బాలురులు తమ ద్విచక్ర వాహనాలను అతి వేగంగా పెద్ద శబ్దాలతో నడుపుతూ బాలికలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. తల్లిదండ్రులు మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఇవ్వకూడదని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నా వారి ఆదేశాలను బేఖాతర్ చేస్తూ ద్విచక్ర వాహనాలను అందించడమేంటని మండల కేంద్రంలోని పలువురు శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనర్లు ద్విచక్ర వాహనం నడపడం చట్టారీత్యా నేరమైన సంబంధిత అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడం వల్లే అతి వేగంగా వాహనాలు నడుపుతూ విద్యార్థినీలను భయాందోళనకు గురి చేస్తున్నారని, ఇప్పటికైన సంబంధిత అధికారులు అతి వేగంగా వాహనాలు నడుపుతూ విద్యార్థినిలను భయాందోళనకు గురి చేస్తున్న మైనర్లపై ప్రత్యేక దృష్టి సారించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని విద్యార్థినీల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పరీక్ష కేంద్రాలను సందర్శించిన డీఈఓ

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని బాలికల, బాలుర ప్రభుత్వోన్నత పాఠశాలల పదోతరగతి పరీక్షా కేంద్రాలను డీఈఓ శ్రీనివాస్ రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పదోతరగతి పరీక్షల నిర్వహణ తీరుపై సంతప్తి వ్యక్తం చేస్తూ మరింత సజావుగా నిర్వహించాలని సీఎస్, డీఓ, సిబ్బందికి డీఈఓ సూచించారు.

## నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఓటు అవగాహన



నవ తెలంగాణ-మిరు దొడ్డి

దేశ ప్రగతికి యువతే రథసారథులని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు ఉండాలని సామాజిక కార్యకర్త బాయికాడి లక్ష్మణ్ నైపుణ్య ఆర్గనైజేషన్ బాధ్యులు ఐలయ్య అన్నారు. ఓటుతోనే సుపరిపాలన సాధ్యపడుతుందన్నారు. ఓటుతోనే యువత భవిష్యత్తు ముడిపడి ఉందన్నారు. ఐదేళ్ల మనల్ని పాలించే వ్యక్తి ఎలాంటి వాడో ఆలోచించుకొని సరైన తీర్పు ఇవ్వాలని సూచించారు. ఓటే కదా అని నిర్లక్ష్యం చూపిస్తే ప్రశ్నించే హక్కు కోల్పోతామన్నారు. ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకోవాలన్నారు.100 శాతం ఓటు శాతం పెరగాలని, హక్కు వినియోగించుకోవాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికలలో ఓటుహక్కు వినియోగించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కమ్మ శ్రీనివాస్ గొట్టం రవి, చంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు..

## సాగు నీటికి గోస



**బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ**

నవ తెలంగాణ-సిద్దిపేట

కేసీఆర్ పాలనలో చెరువులన్నీ నీటితో కళకళలాడేవని, కాంగ్రెస్ పాలనలో సాగు, తాగునీటికి గోస పడుతున్నామని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మెదక్ పార్లమెంటు నియోజకవర్గంలో ఆరు అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకున్న బీఆర్ఎస్ పార్టీకి మెదక్ పార్లమెంటు స్థానం గెలవడం నల్లేరు మీద నడకేనన్నారు. ఈ నెల 26 నుంచి మెదక్ పార్లమెంటు స్థానంలోని అన్ని నియోజకవర్గాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. చాలాకాలంగా ఉమ్మడి మెదక్ జిల్లాతో అనుబంధం ఉన్న మాజీ కలెక్టర్, ప్రస్తుత ఎమ్మెల్సీ వెంకటరామిరెడ్డిని అభ్యర్థిగా ప్రకటించడం తమ పార్టీకి కలిసొచ్చే అంశమన్నారు. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకపోవడంతో ప్రజలు కాంగ్రెస్‌పై విసిగెత్తి ఉన్నారన్నారు. రైతుబంధు పథకం రూ.15 వేలు, కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్‌లో నగదుతో పాటు తులం బంగారం, ఏకకాల రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషితో మెదక్ పార్లమెంటు స్థానాన్ని బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 27న ఉదయం 11 గంటలకు సిద్దిపేట బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం పొన్నాల వద్ద మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఆధ్వర్యంలో 3 వేల మంది పార్టీ కార్యకర్తలతో ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశం జరగనుందని చెప్పారు. సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు, ఎంపీ అభ్యర్థి వెంకటరామిరెడ్డిలతోపాటు జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొని కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మోహన్ లాల్, పాల సాయిరాం, గుండు భూపేష్, యాదగిరి, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ గడ్డ మీద గులాబీ జెండా ఎగరడం ఖాయం



**దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి.**

నవతెలంగాణ- రాయపోల్

మెదక్ గడ్డమీద గులాబీ జెండా ఎగడం ఖాయమని మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి ఘన విజయం సాధిస్తారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి.అన్నారు. శనివారం రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు దాసరి బాలనర్స్ తల్లి దాసరి లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబాన్ని పరామర్శించారు. లింగారెడ్డిపల్లి గ్రామంలో కౌడగారి జగన్ రావు, మచ్చ దుర్గమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబాలను పరామర్శించారు. దుర్గమ్మ మృతితో అనాథలైన ముగ్గురు చిన్నారులను ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఆర్థిక సహాయం అందజేశారు. ఆరేపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు కర్రోళ్ల సత్యం తండ్రి కర్రోళ్ల బాలరాజ్ మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లా అంటేనే బీఆర్ఎస్‌కు అడ్డా అని, ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాజీ కలెక్టర్,ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి ఘన విజయం ఖాయమని ఆయన పేర్కొన్నారు. కలెక్టర్‌గా ఎంతో పరిపాలన అనుభవం ఉన్న వెంకట్రామిరెడ్డికి మెదక్ ఎంపీ అభ్యర్థిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అవకాశం కల్పించడం జరిగిందన్నారు. తనకు ఎంపీగా రెండు మార్లు అవకాశం ఇస్తే ప్రజల ఆశీర్వాదంతో ఘన విజయం సాధించానన్నారు. వెంకట్రామిరెడ్డిని స్థానికేతరుడు అని విమర్శలు చేయడం సరికాదన్నారు. ని, పార్లమెంటు ఎన్నికల్లో దేశంలో ఎక్కడి నుంచి అయినా పోటీ చేసే అవకాశం ఉంటుందన్న విషయం వకీల్‌సాబ్ కు తెలియదా అని ఆయన ప్రశ్నించారు? ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు నీళ్లు అందించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని, సత్వరమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరినా చర్యలు శూన్యమన్నారు. గతంలో ఒక ఫోన్ చేయగానే కాలువలకు నీళ్లు విడుదల చేసే వారని, నేడు పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశ్వరశర్మ, తొగుట మండల అధ్యక్షులు రామ్ రెడ్డి, నాయకులు రాష్ట్ర యువజన విభాగం నాయకులు రాజిరెడ్డి,ఇప్ప దయాకర్, సత్యం, జాఫర్, మధు, మురళి, తిరుపతి నరసింహులు, కల్లూరు శ్రీనివాస్, రాజు, షాదుల్లా, నందు, నగేష్, మల్లారెడ్డి, మల్లేష్, మాజీ సర్పంచ్ కరుణాకర్, మల్లేశం,మల్లాగౌడ్,నర్సింలు పాల్గొన్నారు.

## కారు ఖాళీ, బీఆర్ఎస్‌కు అభ్యర్థులు కరువు



**పార్లమెంటు అభ్యర్థి రఘునందన్ రావు**
**నియంత పాలనకు చరమగీతం**

నవతెలంగాణ-మర్కుక్

కారు ఖాళీ అయి బీఆర్ఎస్ పార్టీకి పార్లమెంటు అభ్యర్థులు కరువయ్యారని బీజేపీ మెదక్ పార్లమెంటు అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. మండల కేంద్రమైన మర్కుక్‌లోని ప్రధాన కూడలి నుంచి రంగనాయక స్వామి ఆలయం వరకు రోడ్ షో నిర్వహించారు. ఆలయంలో బీజేపీ మర్కుక్ మండలాధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి, మర్కుక్ ఇంచార్జి సింగం సత్తయ్య నేతృత్వంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం మర్కుక్ ఎంపిటీసీ సాయిరెడ్డి చైతన్య శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన సుదర్శన యాగంలో రఘునందన్ రావు ప్రత్యక్షంగా పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం బీజేపీ మండల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రఘునందన్ రావు జన్మదిన వేడుకలో భాగంగా ఆయన స్వయంగా పాల్గొని కేక్ కట్ చేసి స్వీట్లను కార్యకర్తలకు పంచారు.అనంతరం బీజేపీ బూత్ కమిటీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కోసం కొట్లాడిన ఉద్యమ కారులను విడిచి పెట్టి కాసుల కోసం పనిచేసిన మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డి ఇచ్చారన్నారు. రాత్రికి రాత్రి ప్రాజెక్టుల ముంపు బాధితులకు ఊర్లు ఖాళీ చేయించిన నరహంతకుడు వెంకట్రామిరెడ్డి అని అన్నారు. వేల కోట్ల రూపాలకు మెదక్ పార్లమెంటు సీటును కేసీఆర్, హరీశ్ రావులు వెంకట్రామిరెడ్డికి అమ్ముకున్నారన్నారు. బీఆర్ఎస్ అవినీతి పాలనకు చరమగీతం పాడిన తెలంగాణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గామిడి మోహన్ రెడ్డి, నాయకులు యెల్లు రాంరెడ్డి, కుడిక్యాల రాములు, సాయిబాబ, టి.రమేష్ గుప్త, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ సింగ్, తిరుపతి రెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు మధు, నాయకులు దేవాదాసు, మహేందర్, కిషోర్ రెడ్డి, జి.చంద్రశేఖర్, అంజిరెడ్డి, మహేష్ గౌడ్, రాజు ముదిరాజ్, కొండల్, కృష్ణ తదితరులున్నారు.

## గజ్వేల్‌లో రూ.50 లక్షలు పట్టుకున్న పోలీసులు



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ఎలాంటి ఆధారాలు లేకుండా కారులో తరలిస్తున్న రూ.50 లక్షల నగదును గజ్వేల్ పోలీసులు పట్టుకున్నారు. శనివారం గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గజ్వేల్ పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద రాత్రి 9 గంటలకు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ సీఐ బి.సైదా మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ ఆదేశానుసారం వాహనాల తనిఖీలు నిర్వహించామన్నారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు అడిషనల్ సీఐ ముత్యం రాజు, కేంద్ర బలగాలు సిఐఎస్ఎఫ్ సిబ్బందితో కలసి గజ్వేల్ పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేశామన్నారు. రాయపోల్ గ్రామానికి చెందిన బచ్చు రత్నాకర్ కారులో రూ. 50 లక్షలు ఆధారాలు లేకుండా తీసుకెళుతుండగా సీజ్ చేశామన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు రూ.50 వేలకు మించి ఎవరూ వాహనాలలో తీసుకెళ్లవద్దని సూచించారు. రూ.50 వేలకు మించి వుంటే తప్పకుండా దానికి సంబంధించిన పత్రాలు ఉంచుకోవాలన్నారు. లేకుంటే డబ్బులను సీజ్ చేసి ఐటీ డిపార్ట్మెంట్‌కు అప్పగిస్తామన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఉన్న గ్రీవెన్స్ కమిటి ద్వారా ఐటీ డిపార్ట్మెంట్‌కు అప్పగించడం జరుగుతుందన్నారు. సదరు బాధితుడు అక్కడికి వెళ్లి అధికారులకు సరైన ధ్రువపత్రాలు చూపించి రిలీజ్ చేసుకోవచ్చని తెలిపారు.

## మెదక్‌లో గులాబీ జండా ఎగరేస్తాం



నవతెలంగాణ -గజ్వేల్

ఎవరెన్ని కుట్రలు పన్నినా మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో గులాబీ జండా ఎగురవేస్తామని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్,రాష్ట్ర నాయకులు మాదాసు శ్రీనివాస్ అన్నారు. గజ్వేల్ విలేఖరుల సమావేశంలో పార్టీ నేతలు ఊడెం కష్ణారెడ్డి, నర్సింగరావు, అత్తెల్లి శ్రీనివాస్,శ్రీధర్ తదితరులతో కలిసి మాట్లాడుతూ మర్కుక్ మండలంలో రఘునందన్ స్థానికత మీద చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. బిజెపి పార్టీకే నిలబడే అభ్యర్థులు లేక బీ బీ పాటిల్, ఆరూరి రమేష్, సైదిరెడ్డి, భరత్, తదితరులను చేర్చుకున్నారన్నారు. స్థానికత మీద మాట్లాడుతున్న రఘునందన్ మొన్న జరిగిన గజ్వేల్ అసెంబ్లీ, ఇప్పుడు జరుగుతున్న మల్కాజ్గిరి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఈటెల రాజేందర్ విషయంలో మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ తన స్వంత రాష్ట్రమైన గుజరాత్ వదిలి ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని వారణాశి లో ఎందుకు పోటీ చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఈ ప్రాంత ప్రజలతో సత్సంబంధాలు కలిగిన వ్యక్తిగానే వెంకట్ రామ్ రెడ్డి అభ్యర్థిగా కేసీఆర్ నిర్ణయించారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జండా ఎగురవేస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రమేష్ గౌడ్,స్వామి, ఉమర్, నిజాం తదితరులు పాల్గొన్నారు.


## క్షయ వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-జగదేవపూర్

క్షయ వ్యాధిని త్వరతగతిన గుర్తించాలని, వ్యాధి తీవ్రత పెరగకుండా చూడాలని, కుటుంబ సభ్యులకు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అధికారులకు సూచించారు. శనివారం జిల్లా కార్యాలయంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. టిబి వ్యాధి గ్రస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తిగా నిర్మూలించేంత వరకు వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు.. క్షేత్రస్థాయిలో ప్రజల్లో టిబి వ్యాధి నిర్మూలన దిశగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. డాట్స్ పద్ధతి ద్వారా క్షయ వ్యాధిగ్రస్తుల ఇంటి వద్దకే వెళ్లి డాట్స్ ద్వారా ట్రీట్మెంట్ ఇవ్వాలని, మందులు మధ్య మధ్యలో ఆపకుండా పూర్తి చికిత్స (6 నెలల వరకు) కోర్సు పూర్తి అయ్యేంతవరకు మందులు కొనసాగిస్తే టిబి చాంపియన్లుగా చేయవచ్చన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, దగ్గుతున్నప్పుడు రక్తం పడడం, సాయంత్ర సమయంలో జ్వరం రావడం, ఆకలి లేకపోవడం, బరువు క్రమంగా తగ్గడం లాంటి లక్షణాలు ఉన్నవాళ్లు దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి తెమడ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లాలో 8 తెమడ నిర్ధారణ పరీక్ష కేంద్రాలు ఉన్నాయని, గజ్వేల్, జిల్లా ఆసుపత్రి సిద్దిపేట ,ఆర్విఎం మెడికల్ కాలేజ్, నంగునూర్, చేర్యాల్ , దుబ్బాక, హుస్నాబాద్ బెజ్జంకిలో తెమడ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని తెలిపారు. అనంతరం క్షయ వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలతో పాటు మెమొంటోలను జిల్లా వైద్యాధికారి, ప్రోగ్రాం అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాశీనాథ్, ప్రోగ్రాం అధికారి టిబి డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ వినోద్ బాబ్జి ,డాక్టర్ రజిని, డాక్టర్ విజయరాణి, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ శ్రీలత,ఏవో రవీందర్ రెడ్డి, టిబి నిర్మూలన కార్యక్రమంలో పని చేసిన ఎస్ టి ఎల్ ఎస్ ,ఎన్జీఓస్,ఏ ఎన్ ఎమ్ ఆశ , ఆరోగ్య సిబ్బంది డెమో నవీన్ రాజకుమార్ పాల్గొన్నారు.

## పల్లా ఖబర్దార్...



**సీఎంను విమర్శిస్తే ఊరుకునేది లేదు**
**మచ్చ శ్రీనివాస్**

నవతెలంగాణ- దుబ్బాక

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే హక్కు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి లేదని కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్ మండిపడ్డారు. పిచ్చి కూతలు మానుకోవాలని హితవు పలికారు. సీఎం రేవంత్ రెడ్డిని విమర్శిస్తే ఊరుకునేది లేదని, పల్లా ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. శనివారం చెరుకు శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలోని అన్ని వ్యవస్థల్ని నాశనం చేసిందని ధ్వజమెత్తారు. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2019 తర్వాత బీఆర్ఎస్ బీఫామ్ మీద గెలిచిన ఎమ్మెల్యేలు అధికారం కోల్పోయిన 2023 వరకు మీ పార్టీలో ఎంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారో లెక్క చెప్పాలన్నారు. ఇతర పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలను భయభ్రాంతులకు గురిచేసి బీఆర్ఎస్‌లోకి లాక్కున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ సర్కార్ తెలంగాణను పునర్‌నిర్మిస్తుందని, తమ సర్కారు అందిస్తున్న ప్రజా పాలనను చూసే కాంగ్రెస్‌లోకి చేరుతున్నారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో దుబ్బాక పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఉశయ్యగారి రాజిరెడ్డి, సీనియర్ నాయకులు అమ్మన కళాధర్ రెడ్డి, బాలకిషన్, సత్తు శ్రీనివాస్ రెడ్డి, కర్ణంపల్లి రమేష్ గౌడ్, మల్లుగారి రామచంద్ర రెడ్డి, స్వామి, నస్కంటి నర్సింలు, పలువురు పాల్గొన్నారు..

## పంచతంత్ర పాఠశాలలో హెూలీ సంబరాలు



నవతెలంగాణ-చేర్యాల

హెూలీ పండుగ సందర్భంగా ముందస్తుగా శనివారం చేర్యాల పట్టణ కేంద్రంలోని పంచతంత్ర పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు హెూలీ సంబరాలను నిర్వహించి, రంగులు చల్లుకున్నారు.హెూలీ పండగ విశిష్టత గూర్చి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. శ్యామల, ఉపాధ్యాయులు కీర్తన,స్నేహ, అంబిక, సంధ్య, ఫరీన్, పావని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటి బిల్లులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి



**మున్సిపల్ కమిషనర్ నరసయ్య**

నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఇంటి బిల్లులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య అన్నారు. శనివారం స్థానిక 14వ వార్డు కౌన్సిలర్ అల్వాల బాలేష్ ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్ ఇంటి పన్ను రూ 1,92,268 లు చెల్లించినట్లు కమిషనర్ తెలిపారు. మరో ఆరు రోజులు మాత్రమే ఆర్థిక సంవత్సరం ఉన్నందున ఇంటి బిల్లులు వ్యాపార బిల్లులు చెల్లించి మున్సిపల్‌కు సహకరించాలని ఆయన కోరారు. ఇంటి బిల్లులు, నల్లా బిల్లులు చెల్లించినట్లయితే మరింత అభివృద్ధి జరుగుతుందని ఆయన చెప్పారు.

## ఘనంగా రఘునందన్ రావు జన్మదిన వేడుకలు



నవ తెలంగాణ-రాయపోల్

దుబ్బాక మాజీ ఎమ్మెల్యే, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు జన్మదినాన్ని పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. రాయపోల్ మండల బిజెపి అధ్యక్షులు రాజాగారి రాజా గౌడ్ ఆధ్వర్యంలో శనివారం రాయపోల్ మండల కేంద్రంలో కేక్ కట్ చేసి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండు,, బ్రెడ్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందాలని ఆకాంక్షించారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు విజయం ఖాయమన్నారు. దేశ ప్రధాని మోడీ ప్రజల కోసం ప్రవేశపెడుతున్న అభివద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయని, పిఎం కిసాన్ ద్వారా రైతులకు పెట్టుబడి సాయం, సబ్సిడీ గ్యాస్, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ముద్ర రుణాలు అందిస్తున్న ఘనత మోడీకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు సంతోష్ రెడ్డి,బిజెపి మండల ప్రధాన కార్యదర్శులు కష్ణ గౌడ్, నీల స్వామి,బీజేవైఎం మండల అధ్యక్షులు సుఖేందర్ రెడ్డి, ఓబీసీ మోర్చ మండల అధ్యక్షులు నమసాని స్వామి, మాజీ మండల అధ్యక్షులు మాదాసు వెంకట్ గౌడ్, సీనియర్ నాయకులు వెంకట్ గౌడ్,తిరుపతి రెడ్డి,భాస్కర్ రెడ్డి,నరేష్ గౌడ్,మల్లేశం, రాజిరెడ్డి, మహేష్, కష్ణ, వీరాచారి, బాలకష్ణ, చిత్తార, స్వామి, కరుణాకర్, నాగరాజ్, గణేష్, షాదుల్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వైద్యాధికారిని కలిసిన పల్లె దవాఖాన డాక్టర్లు



నవతెలంగాణ-మద్దూరు

సిద్దిపేట జిల్లా డిఎం అండ్ హెచ్ వోగా బాధ్యతలు స్వీకరించిన పుట్ల శ్రీనివాసును సిద్దిపేట జిల్లా పల్లె దవాఖాన డాక్టర్ల సంఘం నాయకులు కలిసి సన్మానించారు. ఆ సంఘం అధ్యక్షులు బి శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ స్టువార్ట్సన్, కోశాధికారి గౌతమి, లేడీస్ ప్రతినిధులు అలేఖ్య, మైథిలిలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తుగా హెూలీ వేడుకలు

**నవ తెలంగాణ - సిద్దిపేట**

హెూలీ పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక శ్రీ చైతన్య పాఠశాల మెయిన్ బ్రాంచ్ లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందంగా హెూలీ పండుగను జరుపుకున్నారు. చెడుపై మంచి విజయం సాధించిన సందర్భంగా నిర్వహించుకునే పండుగ హెూలీ అని, సుఖం, దుఃఖం సంతోషం, విచారం ఇవన్నీ కలిసిన రంగులే హెూలీ అని ప్రిన్సిపాల్ ఎజాజ్ అలీ అన్నారు. రసాయనాలతో తయారయినా ప్రమాదకరమైన రంగులను వాడకుండా, సహజంగా లభించే వాటిని చల్లుకోవాలని సూచిస్తూ, శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలలో ఏ. జి. యమ్ మధు, కో ఆర్డినేటర్ లక్ష్మి నాయుడు, డీన్ కర్ణాకర్ రెడ్డి, ఇంచార్జ్ లు రాజన్న, బాబు పాల్గొన్నారు.



## కేసీఆర్ పతనం ఖాయం



**నవతెలంగాణ -గజ్వేల్ :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పతనం ఖాయమైందని తన కూతురు కవిత చేసిన లిక్కర్ మాఫియా డాన్ పార్టీ కతమైందని గజ్వేల్ మండల కాంగ్రెస్ నాయకులు శివారెడ్డి అన్నారు. శనివారం ఆయన ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి ప్రజలను ఆకట్టుకుంటుందని ఆయన చెప్పారు. వంద రోజుల్లోనే అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కిందని ఆయన అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం చాటుకుంటుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి అందిస్తున్నామన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని త్వరలోనే మిగతా హామీలను అమలు చేస్తారని ఆయన అన్నారు. ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోస్తున్నాయని పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ 14 స్థానాలు సాధిస్తుందని ఆయన అన్నారు.

## కస్తూర్బా గాంధీ పాఠశాలలో సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం

**నవతెలంగాణ-మద్దూరు**

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రక్షం సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ పాఠశాల ఎస్ఓ స్వప్న మాట్లాడుతూ పాఠశాలలో చదువుకుంటున్న 185 మంది విద్యార్థులకు 15 డిసెంబర్ 2023 నుండి ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దఢత్వం కోసం విద్యార్థులకు కరాటే ట్రైనింగ్ ఇప్పించినట్లు ఆమె తెలిపారు. విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్ కోసం కరాటే ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే ట్రైనర్ ఎం రాజు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు

## బీఆర్ఎస్ ఎంపీ విజయం ఖాయం

**పట్టణ బి ఆర్ ఎస్ నాయకులు నవాజ్**

**నవతెలంగాణ -గజ్వేల్**



ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి వెంకటరామిరెడ్డి విజయం ఖాయమని పట్టణ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు నవాజ్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్, హరీష్ రావు కృషితో భారీ మెజార్టీ తీసుకొస్తామని ఆయన అన్నారు. మాజీ కలెక్టర్ వెంకట్రాంరెడ్డి గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఇది ప్రజలకు గుర్తుందని ఆయన అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు ఓట్లు వేసే పరిస్థితి లేదని ఆయన చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని ప్రజలు ఓట్లు వేసే పరిస్థితి లేదని ఆయన అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి వెంకటరామిరెడ్డి విజయం ఖాయమని ఆయన అన్నారు.

## బీజేపీ విజయం కోసం కృషి చేయాలి



**నవతెలంగాణ -నంగునూరు**

రాబోయే లోకసభ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు చౌడుచెర్ల వెంకట్రామిరెడ్డి కోరారు. శనివారం నంగునూరు మండల కేంద్రంలో బీజేవైయం మండల కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో నంగునూరు మండల బీజేవైఎం అధ్యక్షుడిగా ఎస్.దీపక్ గౌడ్, ప్రధానకార్యదర్శులుగా గంధం పరమేశ్వర రెడ్డి, ఎం.అనిల్, జి.రాజు, ఉపాధ్యక్షులుగా పర్శరాములు, ప్రతాప్ రెడ్డి, నర్సింహారెడ్డి, ప్రశాంత్, స్వామిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జులు కళ్యాణ్ దాస్, మల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## త్యాగాల పార్టీ కాంగ్రెస్

**నవతెలంగాణ -గజ్వేల్**



త్యాగాల పార్టీ కాంగ్రెస్ పార్టీ అని గజ్వేల్ పట్టణ యువ జనకాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నారు. శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో మహానుభావులు పార్టీ కోసం జీవితాలను త్యాగాలు చేసిన చరిత్ర కాంగ్రెస్‌లో ఉందని చాలామంది నాయకులు రాజకీయంగా, సామాజికంగా అన్ని పరిస్థితులు ఎదుర్కొంటూ పార్టీ నిలబెడుతున్నారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు పోరాటంతోనే పార్టీ అధికారం వచ్చిందని కొందరు పార్టీలోకి రావాలని ప్రయత్నిస్తున్నారని ఆయన చెప్పారు. అందరూ బాగా ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి రావద్దని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు అన్యాయం జరిగే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నాయకత్వంలో గజ్వేల్ నియోజకవర్గం లో పార్టీ బలోపేతం అవుతుందన్నారు. పది సంవత్సరాలుగా కష్టపడ్డామని వారందరికీ గుర్తింపు ఇవ్వాలని ఆయన కోరారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం



**నవతెలంగాణ -గజ్వేల్**

పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు విజయం సాధిస్తారని గజ్వేల్ పట్టణ బిజెపి నాయకులు గాడి పల్లి అనూఫ్ అన్నారు. శనివారం మెదక్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి రమణారావు జన్మదిన వేడుకల బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు జన్మదిన వేడుక సందర్భంగా గజ్వేల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మెదక్ పార్లమెంటు స్థానం బిజెపికి దక్కుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మోడీ చేసిన అభివృద్ధితో మూడవసారి ప్రధానమంత్రి మోడీ అవుతున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్, బి ఆర్ ఎస్ పార్టీలకు ప్రజలు ఓట్లు వేసే పరిస్థితి లేదని ఆయన చెప్పారు. రఘునందన్ విజయానికి తన వంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు.

## మెదక్ పార్లమెంటు బరిలో మళ్లీ రెడ్డి, రావులే

**డిఎస్పీ జిల్లా అధ్యక్షులు రవిబాబు**



**నవ తెలంగాణ - సిద్దిపేట**

మెదక్ పార్లమెంటు నియోజకవర్గంలో 14 లక్షలకు పై చిలుకు ఓట్లను కలిగిన బీసీ ,ఎస్సీ, ఎస్టీ కులాల నుండి పార్లమెంటరీ నియోజకవర్గం అభ్యర్థిత్వం కేటాయించకుండా, బీఆర్ఎస్, బిజెపి పార్టీలు అగ్రకులాలకు చెందిన వారికి పార్లమెంట్ టికెట్లు ఇచ్చారని డిఎస్పీ జిల్లా అధ్యక్షులు రవిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ దోపిడి కులాల ప్రతినిధుల పట్ల బీసీ, ఎస్సీ , ఎస్టీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రాజెక్టుల కోసం బలవంతపు భూసేకరణ, ప్రభుత్వ అన్యాక్రాంత భూముల సేకరణ పరిహారాన్ని పక్కదారి జరిపించడంలో చురుకుగా పనిచేసినందులకు ఎంపీ టికెట్ ఇచ్చారని ప్రశ్నించారు. వీరిచ్చే తాయిలాలకి మోసపోకుండా, మనందరి భవిష్యత్తు తరాల జీవితాలను నాశనం కాకుండా ఉండటం కోసం, మన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజల ప్రతినిధిగా మన వర్గాల వారిని ఎన్నుకోవాల్సిందని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి జిల్లా నాయకులు సురేష్, అనిల్, యాదగిరి, దీపక్, ఆంజనేయులు, యేసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ

**నవతెలంగాణ-సంగారెడ్డి**

భగత్ సింగ్,రాజ్ గురు, సుఖదేవ్ ల 93 వ వర్ధంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల హాస్టల్ నుండి ఎస్పీ ఆఫీస్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి భగత్ సింగ్ కు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ - డి.వై.ఎఫ్.ఐ. జిల్లా కార్యదర్శిలు నల్లవల్లి రమేష్, అనిల్ లు మాట్లాడుతూ .దేశ స్వతంత్రం కొరకు ఉరి కంబాన్ని ముద్దాడిన గొప్ప పోరాట యువకిశోరం భగత్ సింగ్ రాజ్ గురు సుఖ్ దేవ్ అని వారు అన్నారు. దేశ స్వతంత్రం కొరకు పోరాటాలు చేసి జైలు జీవితం గడిపి అమరులైన భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశంలో తొలగించడం చాలా దురదృష్టకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భగత్ సింగ్ స్వతంత్రం కోసం ప్రాణాలర్పించిన గొప్ప పోరాట యోధుని విగ్రహం పార్లమెంట్లో నెలకొల్పాలని వారు డిమాండ్ చేశారు. ఆయన జీవిత చరిత్రను తక్షణమే పాఠ్యాంశాలలో చేర్పించాలని వారు డిమాండ్ చేశారు. భగత్ సింగ్ కు భారతరత్న అవార్డు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వాలు ప్రజా విద్యార్థి వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ అధ్యక్షులు అతివేల మాణిక్యం, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి శ్రీనివాస్, డివైఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్ చింటూ హాస్టల్ కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు.




# విప్లవ వీరుల ఆశయాలను కొనసాగిస్తాం

**భగత్ సింగ్ జయంతి వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి**

**ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజ్ కుమార్**

**నవతెలంగాణ - హుస్నాబాద్ రూరల్**

విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదవ్ ఆశయాలను కొనసాగిస్తామని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజ్ కుమార్ అన్నారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో విప్లవ వీరుల 93 వ వర్ధంతిని నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భగత్ సింగ్ జయంతి, వర్ధంతిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ యాక్ట్ అమలు చేయాలన్నారు. భగత్ సింగ్,రాజ్ గురు,సుఖ్ దేవ్‌ల పోరాట స్ఫూర్తితో విద్యార్థి, యువజన సమస్యల పరిష్కారం కొరకు రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామన్నారు, అతి చిన్న వయసులో దేశ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన రియల్ హీరోలని కొనియాడారు. నాడు స్వేచ్ఛ స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, లౌకికవాద పరిరక్షణ కొరకు అనేకమంది ప్రాణ త్యాగాలు చేసిన వారిలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లని గుర్తు చేసుకున్నారు, నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం రాజకీయ స్వలాభం కోసం కులాలకు,మతాలకు మధ్య చిచ్చు పెడుతూ పబ్బం గడుపుతున్నారని అన్నారు, యువత భవిష్యత్ తరాల కోసం నాడు స్వాతంత్రోద్యమంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారని అన్నారు. బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడానికి భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవ్ల యొక్క పోరాట స్ఫూర్తితో విద్యార్థులను, యువకులను చైతన్య పరుస్తామన్నారు. నిరంకుశ వైఖరితో నడుస్తున్న బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అయిలేని సంజీవ రెడ్డి ,యువ మహిళా జిల్లా కన్వీనర్ రాయకుంట మంజుల, ఏఐవైఎఫ్ హుస్నాబాద్ మండల అధ్యక్ష కార్యదర్శులు తొందూరి రేవతి, జంగం ప్రశాంత్, ఒద్దిరాల అజయ్ రమేష్, ఆనందం,బాలరాజు మహేందర్ , రింకు, సంజన,నిహన్, చిన్ను తదితరులు పాల్గొన్నారు





# ప్రసిద్ధి పుణ్యక్షేత్రం బ్రహ్మారాంబిక మల్లికార్జున ఆలయం

- 200 ఏళ్ల క్రితం నిర్మించిన పురాతన ఆలయం
- శ్రీశైలం తర్వాత ప్రత్యేకతను చాటిన పైతర ఆలయం
- 25న బ్రహ్మారాంబిక మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం
- ముఖ్యతిథిగా హాజరు కానున్న మాదవానంద స్వామి



**నవతెలంగాణ- కొల్చారం**

ప్రసిద్ధి పుణ్యక్షేత్రం శ్రీ శ్రీ శ్రీ బ్రహ్మారాంబిక మల్లికార్జున స్వామి ఆలయం అని చెప్పుకోవచ్చు. ఈ ఆలయం కొల్చారం మండలం పైతర గ్రామంలో కొలువుదీరింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీశైలంలో కొలువుదీరిన శ్రీ శ్రీ శ్రీ బ్రహ్మారాంబిక మల్లికార్జున స్వామి ఆశీస్సులు ఇక్కడి ఆలయంలో సంపూర్ణంగా ఉన్నట్లు పురోహితులు చెబుతున్నారు. అందుకోసం గ్రామస్థులు ప్రతిఏటా శ్రీ శ్రీ శ్రీ మాదవానంద స్వామి ఆశీస్సులతో ఆలయంలో బ్రహ్మారాంబిక మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవ వేడుకలు అంగరంగవైభవంగా నిర్వహించడంతో పాటు తెల్లవారుజామున రథోత్సవం ఊరేగింపుగా నిర్వహిస్తారు. ఆలయం వద్ద అన్నదానం ఉంటుందని, భక్తులకు అన్నివిధాలా సౌకర్యాలు కల్పిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కళ్యాణ వేడుకల్లో శివసత్తుల విన్యాసాలు పలువురిని ఆకట్టుకుంటాయి. ఈ వేడుకలకు పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకుంటారు. ప్రస్తుతం ఈ ఆలయంలో కృష్ణ త్రిపాఠి పురోహితుడు గా మంత్రోచ్ఛరణలు నిర్వహిస్తున్నారు. ఈ ఆలయ చరిత్ర ఈ ప్రాంత పరిణామంతో ముడిపడి ఉందని, ఖచ్చితమైన తేదీలు గుర్తించడం సవాలుగా ఉన్నప్పటికీ, ఆలయ మూలాలు వందల సంవత్సరాల క్రితం గుర్తించబడ్డాయని చారిత్రక రికార్డులు సూచిస్తున్నాయి. చాళుక్య రాజవంశం, కళ వాస్తుశిల్పం యొక్క పోషణకు ఈ ఆలయం ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయ నిర్మాణ శైలిలో చాళుక్యుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఇది క్లిష్టమైన శిల్పాలు, అలంకరించబడిన స్తంభాలు, వివిధ కళాత్మక అంశాల సామరస్య సమ్మేళనంతో ఉంటుందని చెప్పుకోవచ్చు. మల్లికార్జున స్వామి ఆలయం చుట్టూ ఉన్న పురాణాలు హిందూ విశ్వోద్భవ శాస్త్రం పవిత్ర ఇతిహాసాలలో లోతుగా పాతుకుపోయాయి. హిందూ పురాణాల ప్రకారం, శివుడు, పార్వతీదేవి, సృష్టి, విధ్వంసం యొక్క వారి దైవిక నృత్యంలో ఒకసారి మల్లికార్జున, బ్రహ్మారాంబ రూపాన్ని తీసుకున్నట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ ఆలయం మల్లికార్జున స్వామి, బ్రహ్మారాంబ దేవత ఖగోళ వివాహంలో ఐక్యమైన ప్రదేశం అని భక్తులు నమ్ముతారు.





### మహాశివరాత్రి రోజు

మల్లికార్జున ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ పవిత్రమైన రాత్రిలో, శివుడు, పార్వతి దేవి వారి దైవిక సన్నిధితో ఆలయాన్ని అనుగ్రహిస్తారని, మల్లికార్జున, బ్రహ్మారాంబల ఖగోళ వివాహాన్ని చూసేందుకు భక్తులు తరలివస్తారని భక్తులు నమ్ముతారు.

## అంగన్వాడిని సందర్శించిన రిలయన్స్ ఫౌండేషన్ సభ్యులు

**వివరాలు అడిగి తెలుసుకుంటున్న రిలయన్స్ ఫౌండేషన్ సభ్యులు**

**నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్**

సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి లోని మూడు అంగన్వాడీ కేంద్రాలలో శనివారం రిలయన్స్ ఫౌండేషన్ అధికారులు సందర్శించి పాఠశాలల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టీచర్లతో మాట్లాడుతూ పాఠశాలలో వసతులు సౌకర్యాలు పై ఆరా తీశారు. కనీస వసతులను కల్పిస్తామని విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులను అందజేస్తామని ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ పద్మ, మంజుల, శోభ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా గర్భిణీలకు శ్రీమంతాలు

**నవతెలంగాణ-అక్కన్నపేట**

అక్కన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం గర్భిణీలకు ఘనంగా శ్రీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీడీపీఓ జయమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామ, మండల అంగన్వాడీ కేంద్రంలో పోషక పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ ఏడాది పోషణ పక్షం ప్రతిపాదిత థీమ్ లు, పోషణ్ భీ, పడాయి భీ, సాంప్రదాయ, ప్రాంతీయ, స్థానిక ఆహార పద్ధతులు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. తప్పకుండా గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులు పోషకాహార సూచనలు పాటించాలన్నారు. ప్రభుత్వం కూడా తల్లుల ఆరోగ్యం మెరుగుపరచడం కోసం దేశవ్యాప్తంగా పోషకాహారంపై చైతన్యం చేస్తోందని తెలిపారు. తప్పకుండా పిల్లలకు బాలామృతం తినిపించాలన్నారు. అలాగే బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని, దానిలో ఎన్నో పోషక విలువలు ఉంటాయని తెలియజేశారు. తప్పనిసరిగా 30 నిమిషాలు అయినా వ్యాయామం చేయాలని అన్నారు. అనంతరం సూపర్వైజర్లు రేణుక, సుజాత మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండడానికి చిరుధాన్యాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఆధునిక ప్రపంచంలో ఉరుకుల, పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరు మంచి ఆహారానికి దూర మవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోషక విలువలు ఉన్న ఆహారాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా బాలికల్లో రక్తహీనత లోపాన్ని నివారించడానికి ఆకుకూరలు, ఐరన్ చాలా ఉపయోగపడతాయని తెలియజేశారు. తదనంతరం ఆరోగ్య తెలంగాణ కోసం పోషణ లోపం ఏ ఊరిలో కనిపించకూడదనే నినాదంతో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గర్భిణీలకు శ్రీమంతాలు, పిల్లలకి అన్న ప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్ కవిత , పోషణ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ కిరణ్, ఐసిపిఎస్ రాజు, సూపర్వైజర్స్ నాగరాణి, కవిత, అంగన్వాడీ టీచర్లు వసుమతి, స్పందన, విజయలక్ష్మి, ఎలిజబెత్, లక్ష్మి, ఏఈఓ సబిహ, ఏఎన్ఎం భాగ్య, కిశోర బాలికలు, గర్భిణీలు,పాల్గొన్నారు.

